

మాట్లాడుతున్న నారా లోకేశ్



కలికిరి సభలో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

వైసీపీది మాఫియా పాలన

- ఇసుక మాఫియాతోనే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది
- 39 మంది చనిపోయారు.. 26 గ్రామాలు దెబ్బతిన్నాయి
- ఇది తెలిసి ఆందోళన చెందా..
- రాయలసీమలో ప్రాజెక్టులు లేవు.. పరిశ్రమలు లేవు
- రాయలసీమ అభివృద్ధే బీజేపీ లక్ష్యం
- కలికిరి బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోదీ
- మిషన్ రాయలసీమతో ప్రజల కష్టాలు తీరుస్తాం : నారా లోకేశ్
- వైసీపీ పాలనలో తిరోగమనంలో రాష్ట్రం : నాగబాబు
- జనసంద్రమైన కలికిరి
- లక్షలాది మంది జనం హాజరు
- కూటమి నేతల్లో సంతోషం



మాట్లాడుతున్న నాగబాబు



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి





మోదీ ప్రసంగం విని ఉత్సాహంతో ఈలలు వేస్తున్న కార్యకర్తలు



ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, చిత్రంలో లోకేశ్, కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు

రాయచోటి/పీలేరు/కలికిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలు ఎంతో ఆశలు, ఆకాంక్షలతో వైసీపీకి అధికారం ఇచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసింది. రాష్ట్రంలో మాఫియా పాలన నడుస్తోంది. ఈ మాఫియాకు ప్రభుత్వ మద్దతు ఉంది. మంత్రులు రౌడీయిజం, గూండాయిజం చేస్తున్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడితే మాఫియాకు గట్టిగానే బుద్ధి చెప్తుంది.. ఇసుక మాఫియా వల్లే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. 39 మంది ప్రాణాలు పోయాయి. 26 గ్రామాలు దెబ్బతిన్నాయి. ఈ సంఘటన చూసి ఆందోళన చెందాను. అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆవేదన చెందారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పీలేరు నియోజకవర్గం కలికిరిలోని నల్లారివాండ్లపల్లె వద్ద బుధవారం సాయంత్రం ప్రజాగళం పేరుతో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేవు, పరిశ్రమలు కూడా లేకపోవడంతో యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలు, విదేశాలకు వెళ్తున్నారని అన్నారు. రాయలసీమలో ఖనిజాలు, గనులు ఉన్నాయి, ఇక్కడ ప్రసిద్ధి చెందిన అనేక దేవాలయాలు ఉన్నాయి పర్యాటకరంగానికి కూడా ఇక్కడ ఎంతో అవకాశాలు ఉన్నాయని అన్నారు. కష్టపడి పనిచేసే రైతులు, తెలివైన యువతీ యువకులు ఇక్కడ ఉన్నారన్నారు. రాయలసీమ అభివృద్ధే తన లక్ష్యమన్నారు. ఈ ఎన్నికల్లో అధికారంలోకి రాగానే రాయలసీమ అభివృద్ధికి అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కడప-బెంగళూరు రైల్వేలైన్‌ను ఆమోదించామని, నంద్యాల-ఎర్రగుంట్ల రైల్వే పనులు పూర్తయ్యాయని అన్నారు. కడప విమానాశ్రయంలో నూతన టెర్మినల్ నిర్మాణలు జోరుగా సాగుతున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలోనూ బుల్లెట్ ట్రైన్లు నడుపుతామని, ఆంధ్రలో కూడా నడుపుతామని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

అరటి ప్రాసెసింగ్ యూనిట్‌తో ఎంతో మేలు

పులివెందులలో ఏర్పాటు చేసిన అరటి ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా రాయలసీమ ప్రాంతంలోని వేలాది మంది ఉద్యాన రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అరటి తరహాలోనే టమోటా క్లస్టర్ ఏర్పాటు చేస్తామని, దీని వల్ల రాయలసీమలో ఎక్కువగా సాగయ్యే టమోటా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాబోయే ఐదేళ్లలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను పెద్దఎత్తున ప్రోత్సహించడమే కాకుండా.. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని తెలిపారు. ఇవన్నీ జరగాలంటే.. రాయలసీమలోని అన్ని పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలలో ఎన్డీయే కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తన మిత్రుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని ప్రస్తావించారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లాల్లోని కూటమి ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

'మిషన్ రాయలసీమ'తో సీమ ప్రజల కష్టాలు తీరుస్తాం : లోకేశ్

అధినేత చంద్రబాబు స్వప్నమైన వికసిత్ రాయలసీమను సాకారం చేసుకునేందుకు ఆయన మిషన్ రాయలసీమ పథకాన్ని రూపొందించుకుని ఉన్నారని, దాని ఆచరణకు సహకరించాలని ప్రధాని నరేంద్రమోదీని లోకేశ్ కోరారు. మిషన్ రాయలసీమకు సీమ వాసుల కష్టాలు తీరుస్తామని తెలిపారు. కొంత మంది ఫ్యాక్షనిస్టులు సీమ గడ్డపై రక్తం పారిస్తే, చంద్రబాబు నీళ్లు పారించారని తెలిపారు. తాను పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 25 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించానని, 10 లక్షల పంట కుంటలు తవ్వించానని, వేలాది గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించానని అన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఎక్కువ కాలం సాగిన తన పాదయాత్ర ద్వారా ఇక్కడి ప్రజల కష్టాలను స్వయంగా చూశానని, సీమలోని సమస్యలు తీర్చడానికి 'మిషన్ రాయలసీమ'ను రూపొందించామన్నారు. జగన్ సీమ బిడ్డ కాదని, సీమకు క్యాన్సర్ గడ్డలా తయారయ్యారని, ఆయన పాలనలో రాయలసీమ 30 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిందని ధ్వజమెత్తారు. అన్నమయ్య బాధితులకు కనీసం ఇళ్లు కూడా కట్టించలేని చెత్త ప్రభుత్వం జగన్‌దన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి రెండుసార్లు శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటివరకు అక్కడ ఒక్క ఇటుక కూడా పెట్టలేదన్నారు. వికసిత భారత్ నరేంద్ర మోదీ లక్ష్యమైతే, వికసిత రాయలసీమ చంద్రబాబు స్వప్నమని, అందుకే ఆయన అనంతపురం జిల్లాలో కియా కార్ల పంట పండించారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఫ్యాక్స్‌కాన్, డిక్సన్, టీసీఎల్, సెల్‌కాన్ వంటి అనేక సంస్థలను తెచ్చి ఎలక్ట్రానిక్స్ హబ్‌లా తీర్చిదిద్దారన్నారు. కర్నూలుకు ఎయిర్‌పోర్టు, సోలార్ ఎనర్జీ ప్రాజెక్టు, జైన్ ఇరిగేషన్, మెగా సీడ్ పార్క్ లాంటి ఎన్నో సంస్థలు తెచ్చామన్నారు. రాయలసీమలోని ప్రతి గడపకూ కొళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించాలన్న ఆశయంతో రూ.22 వేల కోట్లతో చంద్రబాబు వాటర్ గ్రిడ్ పథకాన్ని రూపొందించారన్నారు. మహోన్నతమైన ఆ పథకాన్నీ జగన్ పక్కన పెట్టేశారన్నారు. పౌరుషాల గడ్డ, రతనాల సీమ అయిన రాయలసీమ వాసులకు నీరందిస్తే బంగారం పండిస్తారని నమ్మిన చంద్రబాబు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని అమలు చేశారని, రాయలసీమకు వరదాయిని లాంటి ఆ పథకాన్నీ జగన్ చంపేశాడని, చంద్రబాబు ఆ పథకానికి ఇచ్చిన ప్రోత్సాహకాలన్నీ జగన్ రద్దు చేశారని అన్నారు. 'ప్రజాగళం' సభలో నారా లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీపై పొగడ్తల వర్షం కురిపించారు. ఆయన స్వతంత్ర భారతావనిలో ఇంత వరకు ఎన్నడూ కనని, వినని అత్యంత శక్తివంతమైన నాయకుడని, ఆయన నేతృత్వంలో దేశం శక్తివంతంగా తయారైందని అన్నారు. ఆయన నడకలో ధైర్యం, ఆయన మాటలో భరోసా ఉంటాయన్నారు. తాను మోదీ నుంచి రెండు విషయాలు నేర్చుకున్నానని, మొదటిది తల్లి హీరా బెన్‌ను గౌరవించడం కాగా రెండవది దేశాన్ని ప్రేమించడం అన్నారు. దేశంతో పాటు ప్రపంచంలోని ఏ మూలకు వెళ్లినా 'నరేంద్ర మోదీ, గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్' అంటూ ప్రశంసిస్తున్నారని లోకేశ్ అన్నారు.

తిరోగమనంలో రాష్ట్రం : నాగబాబు

ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం వెలిగిపోతుంటే.. జగన్ పరిపాలనలో మన రాష్ట్రం తిరోగమనంలో ఉందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు అన్నారు. ఏమాత్రం పరిపాలన దక్షత లేకుండా పాలన చేస్తున్న జగన్ కారణంగా మన రాష్ట్రం పాతికేళ్లు వెనక్కు వెళ్లిపోయిందన్నారు. కేవలం కక్షపూరిత రాజకీయాలు సాగిస్తున్న జగన్ ప్రభుత్వం హిందూ మతాన్ని కూడా తీవ్రంగా అవమానించిందని ఆరోపించారు. కలియుగ ప్రత్యక్ష దైవం కొలువైన పరమ పవిత్రమైన తిరుమల తిరుపతి ఆలయంలో కూడా వైసీపీ ప్రభుత్వం శ్రీవాణి దర్శనాల పేరిట శ్రీవారి దర్శనాన్ని వ్యాపారమయం చేసిందన్నారు. మోదీ కృషి కారణంగా గల్ఫ్ దేశాల్లో స్వామి నారాయణ మందిరం నిర్మితమై హిందూ మతం వ్యాప్తి చెందుతుంటే మన రాష్ట్రంలోని వైసీపీ వారు మాత్రం దేవతా మూర్తుల విగ్రహాలను ధ్వంసం చేస్తూ, వారి రథాలను తగలబెడుతూ హిందూ మతాన్ని అవమానిస్తున్నారన్నారు. శేషాచలం అడవుల్లో మాత్రమే లభ్యమయ్యే అరుదైన ఎర్రచందనాన్ని వైసీపీ స్మగ్లర్లు విదేశాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. గత ఐదేళ్ల కాలంలో సుమారు రూ.3 వేల కోట్ల విలువజేసే ఎర్రచందనం రాష్ట్రం దాటిపోయిందన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌లో ఆరితేరిన ఓ వ్యక్తికి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇవ్వడమే స్మగ్లింగ్‌లో వారి ప్రమేయానికి సాక్ష్యమన్నారు. రాష్ట్రంలో జే ట్యాక్స్ ఉన్నట్టే సీమలో పీ (పెద్దిరెడ్డి) ట్యాక్స్ ఉందని, మైనింగ్ సంస్థల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. మూతపడ్డ మైనింగ్ సంస్థల నుంచి కూడా నెలానెలా లక్షల్లో మామూళ్లు వసూలు చేస్తున్నారన్నారు. వ్యాపారులను, నిరుద్యోగులను పట్టించుకోని, రైతుల సంక్షేమం పట్టని వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలకాలన్నారు. ప్రధానమంత్రి సభకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. కలికిరి జనసంద్రంగా మారింది. కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు, కార్లు, టెంపోల ద్వారా జనం హాజరయ్యారు.

కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, జనసేన రాష్ట్ర నాయకుడు నాగేంద్రబాబు, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు అభ్యర్థి వరప్రసాద్, కడప పార్లమెంటు అభ్యర్థి భూపేష్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి జయచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు నాగోతు రమేశ్‌నాయుడు, బీజేపీ జిల్లా నాయకులు సాయి లోకేశ్‌తో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు.



సభలో ప్రధాని మోదీతో కలిసి ఐక్యతను చాటుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

నియంతృత్వం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం..

చిట్వేలి, మే 8: నియంత పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే కూటమి నాయకత్వాన్ని బలపరచాలని టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల అధ్యక్షుడు కేకే చౌదరితో కలిసి నగిరిపాడు పంచాయతీ సీనియర్ నాయకులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా తిరుగుతూ కూటమి బలపరిచిన కమలం గాజు గ్లాసు గుర్తులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తూ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కష్టాలను చూశారన్నారు. కరెంటు పెట్రోలు, నిత్యవసర వస్తువుల ధరలు పెంచి రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కట్లా లోకేష్, దుగ్గిని ఈశ్వరయ్య, శ్రీధర్, పెద్దూరు రాజా, ప్రవీణ్, నవీన్, వెంకటేష్, కొండ వెంకటేష్, కస్తూరి దివాకర్, నగిరిపాడు పంచాయతీ సీనియర్ నాయకులు గ్రామ ప్రజలు, వెంకటేష్ రాజు, లాయర్ బాలాజీ, లారీ సుబ్బరాయుడు, గుత్తా నరసింహ నానబాల నాగార్జున, మాదాసు నరసింహ, కాకర్ల నాగార్జున, మన్మథ, రాజా, చంగల్ రాయుడు, బాలకృష్ణ యాదవ్, శివ, రాజు, నాగేశ్వరరావు, మహిళా నేత కట్టా ఉమాదేవి ఉమ్మడి కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రాఘవరాజుపురంలో ప్రచారం చేస్తున్న ముక్కా వరలక్ష్మి, శిరీష తదితరులు

ఒక్క అవకాశం ఇవ్వండి..

రైల్వేకోడూరు(రూరల్): ఒక్క అవకాశం కల్పిస్తే కోడూరును అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని రాఘవరాజుపురం, ఉప్పరపల్లె పంచాయతీలో ఇంటింటికి వెళ్లి ఎన్డీఏ కూటమి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. ఉమ్మడి కూటమి జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ గాజు గ్లాసు గుర్తుపై రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కమలం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాఘవరాజుపురం, గంగరాజుపోడు, హరిజనవాడల్లో జనసేన నాయకుడు ముద్దపోలు సభాపతి ఆధ్వర్యంలో ముక్కా కుటుంబానికి బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, ముక్కా రిషిక రెడ్డి, కూటమి నాయకలు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఈ ఎన్నికల్లో యువత గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని యువ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని తెలిపారు. టీడీపీ యువ నాయకులు పట్టణ వార్డు సభ్యులు పోతురాజు నవీన్, మాజీ ఉప సర్పంచ్ నార్జాల హేమరాజ్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి....

ఓబులవారిపల్లె: కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని మండల మాజీ ఉపాధ్యక్షుడు గునిపాటి రాయుడు, గునిపాటి కిరణ్, సీనియర్ నాయకులు కల్లా చలపతి, అనుమలగుండం చంద్ర మోహన్ ఆధ్వర్యంలో బుధవారం మంగంపేట గ్రామ పంచాయతీలో బ్యాలెట్ బాక్స్ నమోనాతో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ గాజు గ్లాసు గుర్తు, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కమలం గుర్తుపై ఓటు వేసే విధానాన్ని గ్రామస్తులకు చూపించారు. ఈ కార్యక్రమంలో కోటూరు మణి, నారదాసు కృష్ణయ్య, కుప్పల్ నాగరాజు, కోటూరు రమణ, మంగారాపు నరసింహులు, తిరుమలశెట్టి శ్రీను, గునిపాటి శివయ్య, సుబ్రహ్మణ్యం రాజు, సిద్దయ్య, టీడీపీ ఉమ్మడి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్‌తో టీడీపీ విజయం తథ్యం

పుల్లంపేట: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్రంలో టీడీపీ అధికారం తథ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు నందవరం అజయ్‌బాబు తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో కూటమి నాయకులతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే వృద్ధులకు 4వేలు పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని, రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పయనింపచేయాలంటే ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని జాబులు రావాలంటే బాబు రావాలన్నారు. కొత్త పరిశ్రమలతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకొచ్చేందుకు చంద్రబాబు నాయుడు అన్ని రకాలా కృషి చేస్తారన్నారు. రాజంపేట, రైల్వేకోడూరులో టీడీపీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారని వారి గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో చుండు ఈశ్వర్ నాయుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, ఆరే సుధాకర్‌నాయుడు, నందవరం సునంద, కాపెర్లచంద్రశేఖర్‌నాయుడు, కేసినేని నారాయణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన గెలుపే లక్ష్యం...

రైల్వేకోడూరు(రూరల్) మే 8: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని చియ్యవరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడుతూ టీడీపీ అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి కోసం టీడీపీ కార్యకర్తలు అహర్నిశలు కృషి చేస్తున్నార న్నారు. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించే బాధ్యత తమదన్నారు. కార్యకర్తలు బేధ అభిప్రాయాలు పక్కనపెట్టి సమష్టిగా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకలు తదితరులు పాల్గొన్నారు.


పుల్లంపేట: ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు


నగిరిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న ఎన్డీఏ నాయకులు


ప్రచారం చేస్తున్న కస్తూరి విశ్వనాథనాయుడు


మాధవరంపోడులో ప్రచారం నిర్వహిస్తున్న ముక్కా వరలక్ష్మి


మంగంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు


హజ్ యాత్రికులు వ్యాక్సినేషన్ చేయించుకోవాలి

రాయచోటిటౌన్, మే8: హజ్ యాత్రికులు వ్యాక్సినేషన్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. బుధవారం ఆయన డీఎస్‌ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి హజ్‌యాత్ర వ్యాక్సినేషన్ క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఈ నెల 8వ తేదీ నుంచి 9వ తేదీ వరక హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటి ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో నాలుగు బృందాలతో నిర్వహిస్తామని, ఒక్కో బృందంలో వైద్యాధికారితో పాటు 7 మంది సభ్యులు ఉంటారన్నారు. ఈ నాలుగు బృందాలను పర్యవేక్షణ అధికారిగా డాక్టర్ సునీతను నియమించామన్నారు. రాయచోటి శిబిరంలో మొత్తం 120 మంది హజ్ యాత్రికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి టీకాలు వేస్తామన్నారు. మదనపల్లె పట్టణంలోని జిల్లా ప్రధాన వైద్యశాలలోని డీఈఐసీ కేంద్రంలో డాక్టర్ శ్రీధర్ పర్యవేక్షణలో నాలుగు బృందాలు టీకాలు వేయడం జరుగుతోందన్నారు. మదనపల్లెలో 150 మంది హజ్ యాత్రికులకు పోలియో, మెయింజో కొకల్, ఇన్‌ఫ్లుఎంజా వ్యాక్సిన్స్ వేస్తామన్నారు. వ్యాక్సినేషన్ అనంతరం వారికి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఈ శిబిరాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని, హజ్ యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

ఇకపై పీహెచ్‌సీల్లో ఉచితంగా స్కానింగ్

రాయచోటిటౌన్, మే 8: ఎంపిక చేసిన పీహెచ్‌సీలలో ఇకపై ఉచితంగా స్కానింగ్ సౌకర్యం అందుబాటులోకి రానుందని అన్నమయ్య జిల్లా పీసీపీఎన్‌డీటీ చట్టం (గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం) నోడల్ అధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. బుధవారం ఆమె జిల్లా కేంద్రం లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఐవో అధ్యక్షతన మొలకల చెరువు, కురబలకోట, పెద్దమండెం, పీటీయం, నందలూర్, చిట్వేల్, రామాపురం, గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా పీహెచ్‌సీల లో గర్భిణులకు స్కాన్ చేసే సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకు గానూ సంబంధించిన పీహెచ్‌సీల వైద్యులకు పీసీపీఎన్ డీటీ చట్టం ప్రొటోకాల్, ప్రమాణాలకు సంబంధించి ఆయా పీహెచ్‌సీలు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి పీసీపీఎన్ డీటీ చట్టం అమలు సభ్యులు డాక్టర్ వెంకటశివ, డాక్టర్ జీనత్‌బేగం, డిప్యూటీ డెమో దేవశిరోమణి, పాల్గొన్నారు.


వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ ఉషశ్రీ

మోదీ సభకు తరలిన బీజేపీ నేతలు

నందలూరు, మే8 : బుధవారం సాయంత్రం తలపెట్టిన నరేంద్రమోదీ బహిరంగ సభకు నందలూరు నుంచి బీజేపీ నేతలు బుధవారం పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ బహిరంగ సభకు రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ అరిగె రాంప్రసాద్, సిద్దవరం మురళీరెడ్డి, హిమగిరి నాథ్ యాదవ్, విటలాచార్య స్వామి, శివారెడ్డి, చుక్కా శ్రీనివాసులు, మురళి, రమణ, మహేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

చిట్వేలి : కలిగిరిలో ప్రధానమంత్రి మోడీ సభకు చిట్వేలి మండలం బీజేపీ నేతలు, కూటమి నేతలతో కలిసి బుధవారం నాలుగు బస్సులలో తరలివెళ్లారు. బీజేపీ ఫీడ్‌బ్యాక్ కమిటీ మెంబర్ తంబరపు సుబ్బరాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆకేపాటి వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు బాపూజీ, మాధవయ్య గౌడ్, మహిళా నేత ఆదిలక్ష్మీ, ప్రసాద్‌రాజు, మండల బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.


నందలూరు: కలికిరిలో నిర్వహిస్తున్న ప్రధాని బహిరంగ సభకు బయలుదేరిన బీజేపీ నేతలు

కిరణ్‌కుమార్ రెడ్డి కృతజ్ఞతలు

కలికిరి: బుధవారం కలికిరిలో జరిగిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ ఊహించిన దానికన్నా ఎక్కువగా విజవంతం చేసినందుకు రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు సభ విజయం కోసం చేసిన కృషి పేరు పేరునా ధన్యవాదాలు చెప్పారు. కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల నుంచి జన సమీకరణ కోసం శ్రమించిన విషయం మరువలేనిదన్నారు. ఇదే సహకారం, స్ఫూర్తి పోలింగ్ పూర్తయ్యే వరకూ కొనసాగించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

లక్కిరెడ్డిపల్లె మే 8: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మద్దిరేవుల పంచాయతీ ఈడిగపల్లెకు చెందిన తుమ్మల వెంకటరమణ(32) కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మంగళవారం రాత్రి ఈడిగపల్లి నుంచి బైకులో వస్తూ ఈయన ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. మృతుడి భార్య బతుదెరువు కోసం కువైట్‌కు వెళ్లిందని, వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు వారి వివరించారు. లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వీరభద్రాలయంలో పల్లకి ఉత్సవం

రాయచోటిటౌన్, మే8: పట్టణంలోని భద్రాకాళీ సమేత వీరభద్రాలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకిపై ఆసీనులను చేసి మాడవీధుల్లో ఊరేగించారు.భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టి మొక్కువలు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు

వైసీపీ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు

● కార్యకర్తల రుణం తీర్చుకుంటాం ● మాజీ ఎంపీ పాలకొండ్రాయుడు, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, మే 8: వైసీపీ అరాచక పాలనకు అంతిమ ఘడియలు దగ్గర పడ్డాయని, ఆ పార్టీని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం గాలివీడు పట్టణంలో రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్టాండులో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల కాలంలో అరాచకత్వం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. రాష్ట్రంలో ఇసుక, మట్టి, సారా ద్వారా వైసీపీ పెద్దలు కోట్లు సంపాదించుకున్నారన్నారు. రాయచోటి నియోజకవర్గంలో ఏ గ్రామంలో చూసినా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, దీనికంతటికి కారణం ఎమ్మెల్యే అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలే కారణమని విమర్శించారు. నియోజకర్గంలోనే అతి పెద్ద మండలమైన గాలివీడు ప్రజలు శ్రీకాంత్‌రెడ్డిని నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించినా వెలిగల్లు జలాశయం నుంచి తన మామిడి తోటకు నీళ్లు తీసుకెళ్లాడే గానీ, కనీసం మండల ప్రజలకు తాగు, సాగునీటిని అందించలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఈ ప్రాంత ఎంపీని ప్రజలు రెండు పర్యాయాలు గెలిపించారని, కానీ ఏనాడైనా మీ మండలం వైపు కన్నెత్తి చూశారా అని ప్రశ్నించారు. వెలిగల్లు జలాశయం నిధులు స్వాహా చేయడంతో కాలువల్లో నీరు పారే పరిస్థితి లేదన్నారు. వెలిగల్లు నీళ్ల గాలివీడు మండల ప్రజలకు ఇవ్వకుండా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశాడని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అన్ని గ్రామాల ప్రజలకు సాగు, తాగునీటిని అందిం చే బాధ్యత తనదేనని మండల ప్రజలకు హామీ ఇచ్చారు. ఇకపోతే జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని మొత్తం దోచుకుని అరాచక పాలన చేస్తూ ప్రశ్నించిన ప్రతిపక్ష టీడీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో అక్రమ కేసులకు భయపడకుండా తాము అండగా ఉంటామన్నారు. మాజీ ఎంపీ పాలకొండ్రాయుడు, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిలు రాముడుతో కలిసి ఒకే వేదికపై చూసిన అభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అనంతరం వారిరువురు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా తమ కుటుంబాలపై అభిమానం చూపిస్తూ తమ తో రాజకీయ ప్రయాణం చేస్తున్న అభిమానులు, కార్యకర్తలు అసెంబ్లీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి సైకిల్ గుర్తుకు, పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కమలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

మండల కేంద్రం పసుపుమయం

జిల్లాలో పేరుగాంచిన మూడు కుటుంబాలకు చెందిన సుగవాసి పాలకొండ్రాయుడు, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, గడికోట ద్వారకనాథరెడ్డి ఒకే వాహనంపై గాలివీడు గేటు నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభం నుంచి అడుగడుగునా అభిమానులు కార్యకర్తలు హారతులు ఇస్తూ ఘనస్వాగతం పలికారు. 20 ఏళ్లలో టీడీపీ సభకు వేలాది సంఖ్యలో ప్రజలు తరలి రావడం ఇదే ప్రథమమని ప్రజలు తెలియజేశారు. రోడ్‌షో విజయవంతంలో లక్ష్మీప్రసాద్‌రెడ్డి కీలకపాత్ర వహించారు.


లక్కిరెడ్డిపల్లె: మండలంలోని దప్పేపల్లె, మేడిమాకులగుంత, గల్లావాండ్లపల్లె, గొల్లపల్లె, వేల్పుచర్లవాండ్లపల్లెల్లో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో బడుగు బలహీన వర్గాల వారు నష్టపోయారన్నారు. అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న శ్రీకాంత్ రెడ్డి రాయచోటి చుట్టుపక్కల భూములన్నీ దోచుకున్నాడని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామీణప్రాంతాలలో రోడ్లు ఏర్పాటు చేస్తామని రాంప్రసాదురెడ్డి హామీ ఇచ్చారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలు కచ్చితంగా అమలు చేస్తారని వైసీపీ మోసపూరిత మాటలు నమ్మద్దని ఓటర్లకు సూచించారు. రాజంపేట పార్లమెంటు డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, రాజంపేట తెలుగుయువత అధ్యక్షుడు తోపిరెడ్డి నవీన్‌కుమార్, గోవింద వెంకటేసు, శ్రీకాంత్ , సురేష్, కాలవ ఆనంద్, గోకుశెట్టి శివ, దుగ్గుల శేఖర్, పెద్ద ఓబులేసు, చిన్నఓబులేసు, మురళి, రమణ, భూషణం పాల్గొన్నారు.



గాలివీడు: ర్యాలీలో పాలకొండ్రాయుడు, రాంప్రసాద్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి

రాయచోటిటౌన్: పట్టణంలోని మాసాపేటలో బుధవారం ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా/ దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన మైనార్టీ సోదరుల ఆత్మీయ సమావేశంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూదేకుల కులస్తుల సంక్షేమానికి టీడీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ నెల 13వ తేదీ జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి అయిన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే కమలం గుర్తుపై ఓటు వేసి ఎన్డీఏ కూటమి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కూడా గెలిపించాలని కోరారు.

రామాపురం: గువ్వలచెరువుకు చెందిన మల్లికె శ్రీనివాసులు, ప్రతాప్, గంగయ్య, రమేశ్‌బాబు, కుమార్, రవి, శంకరయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ మద్దిరేవుల రమేశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో బాలిశెట్టి చంద్రమౌళి, రేఖం బ్రదర్స్, ఆంజనేయులు, శివ, పెద్దరాజా, తిమ్మారెడ్డి, కృష్ణయ్య, అజంబాషా, సుబాన్, బండారు సుబ్బయ్య, పఠాన్ జాఫర్‌ఖాన్, వినోశ్, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


గల్లావాండపల్లెలో రాంప్రసాద్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న కార్యకర్తలు


మాసాపేటలో దూదేకుల సంఘం నేతలతో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


గువ్వలచెరువులో ద్వారకనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు

జిల్లాలో 1129 మి.మీ వర్షపాతం

రాయచోటిటౌన్, మే 8: అన్నమయ్య జిల్లాలో మంగళ, బుధవారాల్లో 1129.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా గణాంక అధికారి తెలియజేశారు. మంగళవారం రాత్రి 1129.0 వర్షపాతం నమోదు కాగా, గాలివీడు 5.4 మిల్లీమీటర్లు, చిన్నమండెం 10.0, సంబేపల్లె 12.4, సుండుపల్లె 42.0, రాయచోటి 29.4, లక్కిరెడ్డిపల్లె 7.0, రామాపురం 60.2, వీరబల్లి 61.4, నందలూరు 26.6, పెనగలూరు 32.0, చిట్వేల్ 21.0, రాజంపేట 49.0, పుల్లంపేట 38.0, ఓబులవారిపల్లె 26.8, కోడూరు 50.2, మొలకలచెరువు 49.4, తంబళ్లపల్లె 27.8, పెద్దమండెం 39.02, గుర్రకొండ 11.0, కలకడ 32.8, కేవీపల్లె 57.2, పీలేరు 41.6, కలికిరి 21.4, వాల్మీకిపురం 24.2, కురబలకోట 33.6, పెద్దతిప్పసముద్రం 45.2, బీ. కొత్తకోట 81.0, మదనపల్లె 114.2, నిమ్మనపల్లె 31.2, రామసముద్రం 47.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలియజేశారు.

నేల రాలిన మామిడికాయలు

లక్కిరెడ్డిపల్లె: మండలంలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సంతో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. దప్పేపల్లె పంచాయతీలోని వీరారెడ్డిగారిపల్లె, మేడిమాకులగుంత, రెడ్డివారిపల్లె, డి.రామాపురం, దిన్నెపాడు పంచాయతీలోని దిన్నెపాడు, నరసింహరాజుగారిపల్లె, వడ్డెపల్లె, పర్వతరెడ్డిగారిపల్లె, కోనంపేట గ్రామాల్లో మంగళవారం రాత్రి పెనుగాలులు, వర్షానికి మామిడి చెట్టు విరిగిపోయాయి. కాయలు నేలరాలాయి. వర్షాభావం కారణంగా కాపు సక్రమంగా లేక నిరాశలో ఉన్న రైతుకు ఈ వర్షం మరింత నష్టం చేకూర్చింది. మామిడి కాయలు నేలపాలు కావడంతో ఈ ఏడాది కూడా అప్పులే మిగిలాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని దప్పేపల్లె కస్పాకు చెందిన శ్రీరాములు, లక్ష్మీదేవి, వెంకటనారాయణ, సుబ్బారెడ్డి, వీరనాగిరెడ్డి కోరారు,

483 ఎకరాల్లో అరటిపంట నేలమట్టం

రాజంపేట : పెనుగాలుల కారణంగా మండల పరిధిలోని ఆకేపాడు, మందపల్లె, పులపత్తూరు, హస్తవరం, బ్రాహ్మణపల్లె, పెద్దకారంపల్లె, ఊటుకూరు పరిధిలో 483 ఎకరాల్లో అరటిపంట నేలమట్టమైనట్లు ఉద్యాన అధికారి జి.సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే తోటలను పరిశీలించి నష్టనివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపామన్నారు.

చిట్వేలి : చిట్వేలి మండలంలో మంగళవారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. పలు చోట్ల గాలికి విద్యుత్ స్తంభాలు కూలి పోయియి. మామిడి కాయలు రాలి పోగా అర్ధరాత్రి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బుధవారం ఉదయం నుంచి విద్యుత్ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. కొద్ది రోజులుగా ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం కాస్త ఊరటనిచ్చింది.


వర్షంలో తడుస్తున్న రాయచోటి వీధులు


వీరారెడ్డిగారిపల్లెలో నేల రాలిన మామిడికాయలు






ముంపు గ్రామాల్లో సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న ప్రజలు, ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం, నందలూరులో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు, వీరబల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

వచ్చేది ఇక మన ప్రభుత్వమే..

- అసెంబ్లీలో అడుగు పెట్టగానే అన్నమయ్య బాధితులను అన్ని విధాలా ఆదుకుంటా..
- అన్నమయ్య ముంపు బాధితులతో సుగవాసి బాలసుబ్రమణ్యం



అన్నమయ్య ముంపు గ్రామాల్లో భారీ గజమాలతో సుగవాసి బాలసుబ్రమణ్యంకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

రాజంపేట, మే 8: వైసీపీ నేతల దాష్టీకం వల్ల అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోగా, నిర్వాసితులకు ఇంత వరకు ఒక్క ఇల్లు కూడా కట్టించకుండా అన్ని విధాలా ఇబ్బందులపాలు చేస్తున్నారని టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆరోపించారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, తనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే, అసెంబ్లీలో అడుగుపెట్టిన వెంటనే బాధితులందరికీ అన్ని విధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజంపేట మండలంలోని అన్నమయ్య డ్యాం బాధిత పులపత్తూరు, మందపల్లె, బగ్గిడిపల్లె, చింతలకోన, శేషమాంబపురం అగ్రహారం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైసీపీ నాయకులు తమ ఇసుక లారీలను కాపాడటం కోసం ప్రాజెక్టును తెంచేశారని 40 మంది ప్రాణాలను పొట్టనపెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఎటువంటి సహాయం చేయలేదన్నారు. 400 ఇళ్లు కొట్టుకుపోతే ఒక్కరికీ ఒక్క ఇల్లు కట్టించక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రాజెక్టు తెగిపోయి రెండున్నరేళ్లు కావస్తున్నా ఇంతవరకు రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని, పంట పొలాల్లో ఇసుక మేటలు తొలగించలేదని, 2 వేల పైబడి పశువులు చనిపోతే బాధితులను ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు గ్రామ పంచాయతీలు పూర్తిగా నీటమునగడం వైసీపీ వారి వల్లేనని బాధితులం దరికీ తెలిసిందేనన్నారు. ఈ సమయంలో ఓటు అన్న ఆయుధంతో వారిని గద్దెదించాలన్నారు. మీకోసం పరితపించే టీడీపీకి ఓటు వేయాలన్నారు. ఇటీవల రాజంపేటకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తామని, బాధితులను ఆదుకుంటామని ప్రకటించిన విషయం తెలిసిందేనన్నారు. నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రకటనను స్వాగతించి ముంపు ప్రాంత ప్రజలందరూ ఓటు వేసి గెలిపించాలని ,విచ్ఛిన్నర వైసీపీని దూరం పెట్టాలన్నారు. ఈ సందర్భంగా అడుగడుగునా అన్ని ముంపు గ్రామాల్లో మహిళలు మంగళహారతులు పడుతూ భారీ గజమాలలతో స్వాగతం పలికారు. తాము పడుతున్న బాధలను బాలసుబ్రమణ్యం ముందు ఏకరువు పెట్టారు. వారి సమస్యలను ఓపికగా విని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు పోలి సుబ్బారెడ్డి, టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం బావమరిది మన్నూరు సునీల్, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, తెలుగు మహిళా పార్లమెంటు అధ్యక్షురాలు అనసూయమ్మ, రాజంపేట పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్‌రాజు, మండపల్లె నాయకులు కొండా శ్రీనివాసులు, శేషమాంబపురం అగ్రహారం నాయకులు పసుపులేటి చంద్రశేఖర్, అంకాల్ ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ నవీన్, జనసేన పార్టీ నాయకులు వెంకటయ్య, మల్లికార్జునరాజు, దొరబాబు, రవిరాజు పాల్గొన్నారు.

రాజంపేటలో ముస్లింల ప్రచారం

టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ నగర్, రసూల్ నగర్, వినాయక నగర్, నూనెవారిపల్లె రోడ్డు, పార్కు వీధి చుట్టుపక్కల ప్రాంతాల్లో ముస్లింలు ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో బాలసుబ్రమణ్యంను గెలిపించాలన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాల అభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ గడికోట గుల్జార్ బాషా, రాజంపేట పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి అబుబకర్, మైనారిటీ నాయకులు కమాల్, బుజ్జి, మస్తానయ్య, మహబూబ్‌బాషా, మన్నూరు కరీం తదితరులు ఈప్రచారంలో పాల్గొన్నారు.

అగ్రహారంలో ముమ్మర ప్రచారం

రాజంపేట మండలం కూచివారిపల్లె పంచాయతీ అగ్రహారం, చుట్టుపక్కల ప్రాంతాల్లో బుధవారం మహిళా మండలి ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. కూచివారిపల్లె, అగ్రహారం, బ్రాహ్మణపల్లెకు చెందిన మహిళా మండలి నేతలు ఈ ప్రచారంలో పాల్గొన్నారు. మహిళలకు అన్ని విధాలా రక్షణగా ఉంటూ, సంక్షేమ పథకాల అమలులోనూ, మహిళా స్వావలంబనకు పాటుపడే టీడీపీకి మహిళలందరూ ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అగ్రహారం నాయకులు చల్లా సుధాకర్‌బాబు, టీడీపీ మహిళా పార్లమెంటు ఉపాధ్యక్షురాలు వాణి, మహిళా నేత శ్రీలత, త్రివేణీ, రమాదేవి, దేవకి, కిషోర్, రవిశంకర్, వెంకటేష్, హరి, కుమార్, శ్రీనివాసరాజు తదితరులు ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈడిగపాలెంలో టీడీపీ నేతల ప్రచారం

రాజంపేట పట్టణం ఈడిగపాలెం ప్రాంతంలో కౌన్సిలర్ మౌనిక, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్, సీనియర్ బీసీ నాయకులు మనుబోలు వెంకటసుబ్బయ్య, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మల్లెల శ్రీవాణి, టీడీపీ నాయకులు మన్నూరు సునీల్, పట్టణ మాజీ అధ్యక్షులు సంజీవరావు, మైనారిటీ నేత గుల్జార్‌బాష, దంత వైద్యులు డాక్టర్ నవీన్, ఈడిగపాలెం ప్రాంత టీడీపీ నాయకులు, యువకులు బుధవారం పెద్దఎత్తున టీడీపీ తరఫున ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధిచేకూర్చే పార్టీకే అందరూ ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అదేవిధంగా పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ, నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోనూ బుధవారం సుగవాసి బాలసుబ్రమణ్యం తరఫున ఎన్‌డీఏ నాయకులు ప్రచారం నిర్వహించారు.

'గుగ్గిళ్ల' సైకిల్ ప్రచారం

రాజంపేట పట్టణంలోని విద్యుత్‌నగర్, బలిజపల్లె ప్రాంతాల్లో స్థానిక నాయకులతో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి సైకిల్‌పై ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రమణ్యంనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లి రెడ్డయ్యనాయుడు, డాక్టర్ నవీన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: ఎన్‌డీఏ కూటమి బలపరిచిన రాజంపేట తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సైకిల్ గుర్తుకు, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కమలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాజంపేట టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని లేబాక, టి.వి.పురం పంచాయతీలలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎద్దుల విజయసాగర్, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, నాయకులు మల్లికార్జునరెడ్డి, సయ్యద్ అమీర్, పసుపులేటి సుబ్రమణ్యం, షర్మిల, నాగేంద్ర, దండు నాగేశ్వరరావు, చక్రాల సాయి, గోపాల్‌రాజు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: పేదలకు న్యాయం జరగాలంటే టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓటు వేయాలని మండల టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని సాలాబాదు, మలకాటిపల్లె, విద్యానగర్ గ్రామాల్లో మండల టీడీపీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థులను ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుగవాసి మురళి, సుగవాసి సాయిప్రణవ్, అడ్వకేట్ రామదాసు, పామూరు సుబ్రమణ్యం, వెంకటనరసయ్య, శివారెడ్డి, బొబ్బిలి రాయుడు, కరెంటు రమణ, ప్రతాప్‌రెడ్డి, దాసు, వినోద్‌రెడ్డి, బుజ్జి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సిద్దవటం: మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో బుధవారం కూటమి అభ్యర్థుల గెలుపు కోసం రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఎన్నికల పరిశీలకుడు అతికారి కృష్ణ, తెలుగు యువత అధ్యక్షుడు కుప్పాల వెంకటసుబ్బయ్య, టీడీపీ బూత్ ఇన్‌చార్జి, వార్డు ప్రతినిధి పొట్ట శివప్రసాద్ ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ప్రజలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అతికారి కృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను, బీజేపీ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు అధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మపాలెం హరిజనవాడలో ఇంటింటా ప్రచారం

మండలంలోని కమ్మపాలెం హరిజనవాడ, జంగాలపల్లి హరిజనవాడ గ్రామాల్లో రాజంపేట టీడీపీ యువ నాయకుడు రాజానాయుడు, అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నాగభూషణం, శ్రీరాములు, శ్రీనివాసులు, నాగరాజు, చిన్న బాలయ్య, మహేష్ నాయుడు పాల్గొన్నారు.

వీరబల్లి: మహిళల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం గడికోట పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజంపేట టీడీపీ అభ్యర్థి అయిన తన సోదరుడు బాలసుబ్రమణ్యంకు, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు తాటిగుట్ల శ్రీధర్ రెడ్డి, రెడ్డప్పరెడ్డి, నాగూర్‌రెడ్డి, సీతారామరాజు, రాజారాజు, పలువురు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.






అన్నమయ్య ముంపు గ్రామాల్లో బాలసుబ్రమణ్యంకు మంగళహారతులు పడుతున్న మహిళలు, అన్నమయ్య ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్న బాలసుబ్రమణ్యం, పోలి సుబ్బారెడ్డి తదితరులు, సిద్దవటంలో ప్రచారంలో పాల్గొన్న నాయకులకు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు, రాజంపేట పట్టణం ఈడిగపాలెంలో సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా ప్రచారం చేస్తున్న మున్సిపల్ మాజీ ఛైర్మన్ మల్లెల శ్రీవాణి తదితరులు

జాతీయ ఫారెస్ట్ సర్వీస్ ఫలితాల్లో

నందలూరు వాసికి 52వ ర్యాంకు



కృష్ణ శ్రీవాస్తవ్

నందలూరు, మే 8: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) బుధవారం విడుదల చేసిన భారతీయ ఫారెస్ట్ సర్వీసెస్ ఫలితాల్లో గొబ్బిళ్ల కృష్ణశ్రీవాస్తవ్ 52వ ర్యాంకు సాధించి నందలూరు కీర్తిప్రతిష్టలను మరోసారి పెంపొందించాడు. ఇటీవల విడుదలైన ప్రతిష్ఠాత్మక సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 444వ ర్యాంకు సాధించారు. కృష్ణశ్రీ వాస్తవ్ 2023లో గ్రూప్-1 పరీక్షల్లో విజయం సాధించి రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంటల్ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. ఈయన సోదరి గొబ్బిళ్ల విద్యాధరి ప్రస్తుతం కందుకూరు సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి తల్లి గొబ్బిళ్ల సుజాతమ్మ 3 దశాబ్దాలకు పైగా విద్యారంగంలో సేవలు అందించారు. గతంలో సోదరి విద్యాధరి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో ఆల్ ఇండియా ర్యాంక్ 2 సాధించడం గమనార్హం. ప్రస్తుతం తమ్ముడు కూడా అదే బాటలో అటూ యూపీఎస్సీ సివిల్స్ 444తో పాటు ఇటు ఫారెస్ట్ సర్వీస్‌లో 52 సాధించి అక్కకు తగ్గ తమ్ముడిగా నిలిచి తల్లికి ఎంతో ఆనందాన్నిచ్చారు. జాతీయ స్థాయి ఫారెస్ట్ సర్వీస్ ఫలితాల్లో రాణించడంతో కుటుంబంతో పాటు గొల్లపల్లెలో సంబరాలు జరుపుకున్నారు.

కొర్లకుంటలో ఐటీ, ఎన్నికల అధికారుల తనిఖీలు

- భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు సమాచారం



తనిఖీలు నిర్వహిస్తున్న ఇంటి ముందు ఉన్న కేంద్ర బలగాలు

రైల్వేకోడూరు(రూరల్)/ఓబులవారిపల్లె, మే 8: ఓబులవారిపల్లె మండలంలోని కొర్లకుంట గ్రామంలో మండల వైసీపీ కన్వీనర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి ఇంటి ముందున్న తుంగా గంగాధర్‌రెడ్డి ఇంట్లో ఐటీ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులు సాయంత్రం నాలుగు గంటల నుంచి సోదాలు నిర్వహిస్తున్నారు. గంగాధర్‌రెడ్డి ప్రవాసాంధ్రుడు కావడం, ఎన్నికల కోడ్ అమలు ఉన్నప్పుడు భారీ మొత్తంలో నగదు లావాదేవీలు చేసినట్లు సమాచారం రావడంతో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. కేంద్ర బలగాలు, పోలీస్, ఎన్నికల అధికారులు సోదాలు నిర్వహిస్తుడంతో గ్రామంలోని జనాలు ఎగబడి చూస్తున్నారు. ఈ విషయంపై ఎన్నికల అధికారి టి.లీలారాణిని వివరణ అడగగా తనిఖీలు పూర్తయేందుకు ఇంకొంచెం సమయం పడుతుందని తెలిపారు. కాగా, ఈ దాడుల్లో భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు సమాచారం.

పెనుగాలుల బీభత్సం

- నేల కూలిన అరటి తోటలు
- 200 ఎకరాల్లో పంట ధ్వంసం, రూ.2 కోట్లు నష్టం



రైల్వేకోడూరు మండలం ఉప్పరపల్లెలో నేలవాలిన అరటితోట

రైల్వేకోడూరు, మే 8: పెనుగాలుల బీభత్సంతో 200 ఎకరాల్లో అరటి తోటలు నేలమట్టం కావడంతో రూ.2 కోట్ల మేర నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. అరటి గెలలు పది రోజుల్లో చేతికందే సమయంలో పెనుగాలుల రూపంలో వచ్చి రైతులను నష్టపరిచాయి. ఒక్క అరటి గెల ప్రస్తుతం రూ.450 పలుకుతోంది. రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయి. రైల్వేకోడూరు మండలంలోని ఉప్పరపల్లె, జానకీపురం గ్రామాల్లోనే సుమారు 50 ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయి. గంగురాజుపోడు గ్రామంలో గాలి రామయ్య, గాలి సుబ్రహ్మణ్యం అనే రైతులకు చెందిన 2 వేల అరటి చెట్లు నేల మట్టం అయ్యాయి. ఉప్పరపల్లెకు చెందిన కుప్పాల మురళి, ఉమ్మడి వెంకటయ్య, రామసుబ్బారెడ్డి తదితర రైతులకు చెందిన అరటి తోటలు 50 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. అలాగే నియోజకవర్గంలో అరటితో పాటు బొప్పాయి, మామిడి తోటలు కూడా స్వల్పంగా దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉన్నపళంగా ఉరుములు, మెరుపులు, పిడుగులు పడినట్లు శబ్దంతో పాటు వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. విపరీతమైన ఉక్కపోత తో ప్రజలు అల్లాడిపోయారు. బుధవారం ఉదయం 11 గంటల సమయం వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. నియోజకవర్గం మీద సుమారు 20 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ తీగలు పడిపోయాయి. విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది కలసి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేశామని రైల్వేకోడూరు విద్యుత్ శాఖ ఏడీ భాస్కర్‌రావు తెలిపారు.



దెబ్బతిన్న అరటి గెలను చూపుతున్న రైతు రామసుబ్బారెడ్డి



కూలిన అరటి తోట వద్ద ఆందోళన చెందుతున్న గాలి రామయ్య

కడప
అన్నమయ్య
గురువారం 9 మే 2024
జన కేతనం
ఆంధ్రజ్యోతి
www.andhrajyothy.com

ఓటుహక్కును వినియోగించుకోండి



కడప (ఎర్రముక్కపల్లె), మే8: 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడికీ ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించింది. ప్రతి ఓటరూ తమ హక్కును వినియోగించుకోవాలి. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ మేధావులు, రాజకీయ పార్టీలు పదే పదే చెబుతుంటాయి. ఒక్కో నియోజకవర్గంలో చాలా మంది ఎన్నికల బరిలో ఉంటారు. అభ్యర్థులకు ఓటు వేయడం ఇష్టం లేకపోతే చివరి వరుసలో ఉన్న నోటా బటన్ నొక్కితే సరిపోతుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు అవకాశం కల్పించింది.

'నల్లారి'ది నల్లేరుపై నడకే

- 'చింతల' స్థితిపై జనం పెదవి విరుపు
- ఉవ్వెత్తున ఎగిసిన కెరటం
- నారా లోకేశ్ పర్యటనతో పీలేరులో జోష్
- అక్రమ కేసులతో పెరిగిన కసి
- భారీ చేరికలతో టీడీపీలో సమరోత్సాహం
- ప్రభుత్వ, నేతల వ్యతిరేకతతో వైసీపీ ఉక్కిరిబిక్కిరి

పీలేరు, మే 8: ఓటమి వెక్కిరించినా కుంగిపోకుండా గెలవాలన్న కసి, జోష్‌తో పీలేరులో టీడీపీ సమరోత్సాహంలో ఉండగా, ప్రభుత్వ వ్యతిరేకత, స్థానిక నేతలు దురాక్రమణల పర్వంపై ప్రజల్లో పెరిగిన అసహనంతో వైసీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఎడతెగని వరుస చేరికలతో టీడీపీ టాప్ గేర్‌లో ఉండగా, అంతర్గత కలహాలు, అసమ్మతి, అసంతృప్తులతో వైసీపీ ఇబ్బంది పడుతోంది. ప్రభుత్వ విధానాలు, స్థానిక నేతల ఆక్రమణలపై రాజీలేని పోరాటం చేసిన నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ప్రజల మన్ననలు చూరగొని ఈ ఎన్నికల్లో విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతుండగా, పదేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్నా 'రబ్బరు స్టాంపు'గా పేరుసంపాదించుకున్న చింతల రామచంద్రారెడ్డి ఎదురీదుతున్నారు. 2019 ఎన్నికల తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ నల్లారి కుటుంబాన్ని ఒంటరిని చేయాలన్న ఏకైక లక్ష్యంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పీలేరులో రాజకీయాలు సాగించారు. వారు వలసలు ప్రోత్సహించిన తీరు, సాగించిన ప్రలోభాల పర్వంతో పూర్తిగా ఖాళీ అయిపోయిందనుకున్న స్థితి నుంచి అధికారంలో ఉన్న పార్టీకి ముచ్చెటమలు పట్టించే స్థాయికి చేరుకోవడంలో పీలేరు టీడీపీ ఇన్‌చార్జ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి కృషి దాగి ఉంది. 2019 ఎన్నికల్లో రెండోసారి ఓటమి ఎదురైనా, ప్రత్యర్థి వర్గం పదేపదే ఇబ్బందిపెడుతున్నా, చెంతనున్న వారు చేజారుతున్నా ఏనాడూ ధైర్యం కోల్పోలేదు. అధికార పార్టీలో బలవంతులు ఉన్నారని భయపడి నిస్సహాయంగా చేష్టలుడిగి కూర్చున్న క్యాడర్‌లో సైతం ఆయన ఆత్మవిశ్వాసం నింపి అంచెలంచెలుగా పార్టీని పునర్నిర్మించారు. ప్రభుత్వ విధానాలు, స్థానిక నేతల అవినీతి, అక్రమాలపై పోరుబాట పట్టారు. నియోజకవర్గంలోని ఏ మూల ఏ అన్యాయం జరిగినా స్పందిస్తూ బాధితుల గొంతుకగా నిలిచారు. పార్టీ పిలుపుతో ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. వ్యక్తిగత అభిప్రాయభేదాలను పక్కనపెట్టి పార్టీని కుటుంబంలా చూడడం నేర్చుకున్నారు. టీడీపీ నేతల చిత్తశుద్ధిని ప్రజలు కూడా విశ్వసిస్తూ టీడీపీ వెంట నడవడం ప్రారంభించారు. చివరకు టీడీపీకి ఎటువంటి ప్రాతినిధ్యం లేని కుగ్రామాల నుంచి సైతం ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్నారు. 2019 అధికారంలోకి వచ్చిన కొత్తల్లో ఇక పీలేరు నుంచి టీడీపీని సమూలంగా తుడిచి పెట్టేయవచ్చని ప్రగల్భాలు పలికిన వైసీపీ నేతలు ప్రస్తుతం ప్రజలను, తమ పార్టీ క్యాడర్ టీడీపీలోకి వెళ్లకుండా కట్టడి చేసేందుకు చెమటోడుస్తున్నారు.

భూఆక్రమణలపై పోరుబాటతో ప్రజల్లోకి...

2019 ఎన్నికల్లో ఓటమి వెక్కిరించినా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి కుంగిపోలేదు. ప్రజలకు సేవ చేయాలన్న ఏకైక లక్ష్యంతోనే తమ కుటుంబం పనిచేస్తోందని, పదవులతో తమకు నిమిత్తం లేదని ఆయన పదేపదే చెబుతూ అప్పట్లో పార్టీ క్యాడర్‌లో ధైర్యం నింపే ప్రయత్నం చేసేవారు. నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి అటు రాజకీయంగా, ఇటు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెంచేందుకు అధికార పార్టీ నేతల భూఆక్రమణలు కలిసి వచ్చాయి. వైసీపీ నేతలు ప్రభుత్వ, డీకేటీ, ప్రైవేటు భూముల ఆక్రమణలకు తెగపడడంతో నియోజకవర్గవ్యాప్తంగా ప్రజల్లో అభద్రతాభావం నెలకొంది. ఇదే అంశాన్ని నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తన పోరాటానికి ఆయుధంగా మలుచుకున్నారు. పీలేరు పట్టణం, దానికి ఆనుకుని ఉన్న ఎర్రగుంటపల్లె, దొడ్డిపల్లె, గూడరేవుపల్లె, బోడుమల్లువారిపల్లె, ముడుపులవేముల గ్రామ పంచాయతీల్లో అధికారపార్టీ నేతలు సుమారు రూ.400 కోట్లు విలువైన 600 ఎకరాల భూములను ఆక్రమిం చుకున్నారని సంచలన ఆరోపణలు చేశారు. దీంతో సరిపెట్టకుండా గూగుల్ మ్యాప్స్ వంటి సాంకేతిక ఆధారాలు సహా పాత్రికేయులకు అందించడం, ఆక్రమణలపై జిల్లా ఉన్నతాధి కారులు, రాష్ట్ర లోకాయుక్త, హైకోర్టులో ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలు తామెక్కడా ఆక్రమణలు, అవినీతికి పాల్పడలేదని బుకాయించినా విషయం పెద్దదవడంతో ప్రభుత్వం నష్టనివారణ చర్యలకు ఉపక్రమించింది. ఆయన అందించిన ఆధారాలతో విచారణ చేయాలని అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ హరినారాయణ, అప్పటి మదనపల్లె సబ్-కలెక్టర్ జాహ్నవిని ఆదేశించారు. ఆమె పర్యవేక్షణలో ఆరుగురు తహసీల్దార్లతో కూడిన 60 మంది సభ్యుల బృందం సుమారు రెండు నెలలపాటు విచారణ జరిపింది. కిశోర్ కుమార్ రెడ్డి సేకరించిన ఆధారాలన్నీ నిజమేనని, అధికార పార్టీ నేతలు సుమారు రూ.400 కోట్లు విలువైన 600 ఎకరాల భూముల్లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించారని సబ్-కలెక్టర్ జాహ్నవి కలెక్టర్‌కు నివేదిక అందజేసింది. దీంతో కిశోర్ కుమార్ రెడ్డి నైతిక విజయం సాధించినట్లైంది. ఫలితంగా నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం మొదలైంది.



'యువగళం'తో పీలేరులో నవశకం

ఎప్పటికప్పుడు ప్రభుత్వంపై పార్టీ పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నా 2023 మార్చిలో పీలేరులో జరిగిన నారా లోకేశ్ 'యువగళం' పాతయాత్ర పీలేరు టీడీపీలో నవశకానికి నాంది పలికింది. చిత్తూరు జిల్లా కల్లూరు నుంచి పీలేరులోకి ప్రవేశించిన లోకేశ్ పాదయాత్రకు నేతల అంచనాలను తలకిందులు చేస్తూ పట్టణం సహా మండలంలోని అనేక గ్రామాల నుంచి సుమారు 10 వేల మంది చిత్తూరు మార్గం రైల్వేగేటు వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఇసుక వేస్తే రాలనంత జనం పోగయ్యారు. కేవలం పీలేరు పట్టణమే కాకుండా పీలేరు నియోజకవర్గంలో ఆయన పాదయాత్ర సాగిన కలికిరి, వాల్మీకిపురం పట్టణాల్లోనూ ప్రజలను నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల్లో తమ పట్ల, తమ పార్టీ పట్ల లభించిన స్పందనను చూసి టీడీపీ శ్రేణుల్లో సరికొత్త జోష్ నిండింది. ఎన్నికల వాతావరణం ప్రారంభమైన నాటి నుంచీ టీడీపీలోకి భారీ స్థాయిలో చేరికలు జరిగాయి.

పుంగనూరు, అంగళ్లు కేసులతో పెరిగిన కసి

పుంగనూరు, అంగళ్లలో జరిగిన చంద్రబాబు పర్యటన సందర్భంగా అధికార పార్టీ సృష్టించిన అల్లర్ల కేసులో పీలేరు నియోజకవర్గానికి చెందిన 135 మంది వైసీపీ నేతలను అకారణంగా కేసుల్లో ఇరికించారు. కేసుల్లో ఉన్న వారు చెట్టుకొకరు, పుట్టకొకరు పారిపోయి ఎక్కడెక్కడో తలదాచుకున్నారు. దానిని అవకాశంగా మలుచుకుని కేసుల్లో ఉన్న వారిని తమ వైపు తిప్పుకోవాలని వైసీపీ నేతలు శతవిధాలా ప్రయత్నించారు. వివిధ రకాల ఆశలు చూపి సామాన్య కార్యకర్తల నుంచి నాయకుల వరకు లొంగదీసుకోవాలని ప్రయత్నించారు. నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిపై నమ్మకంతో ఏ ఒక్కరూ వారికి లొంగలేదు. ఆయన కూడా వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సొంత నిధులతో వారందరికీ హైకోర్టులో బెయిలు సంపాదించారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి వైసీపీ నేతలకు బుద్ధిచెప్పాలన్న కసి పెరిగింది. తమ పరిధిలో శ్రమించి తమ ప్రాంతంలో అధికార పార్టీ పట్ల అసంతృప్తి, అసమ్మతితో ఉన్న సామాన్య కార్యకర్తలు మొదలు ఓ మోస్తరు నేత వరకు ఆకర్షించి పార్టీలోకి చేర్చుకోవడం ప్రారంభించారు. దీంతో ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచీ పీలేరు నియోజకవర్గంలో టీడీపీలోకి వలసలు పెరిగాయి.

భారీగా చేరికలతో దూకుడు పెంచిన టీడీపీ

ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుదలతో టీడీపీ నేతలు వైరిపక్షంలోని అసంతృప్తులను ఆకర్షించడం ప్రారంభించారు. అలా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని నాయకత్వం శ్రమించి తమ పరిధిలో చేరికలను ప్రోత్సహించారు. అలా కలికిరి మండలంలో కలికిరి సిట్టింగ్ సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ రెడ్డి, మహల్ గ్రామ మాజీ సర్పంచ్ ఖాజా హుస్సేన్, ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ అధ్యక్షుడు పూల అన్వర్ బాషా, కేవీపల్లె మండలంలో మాజీ ఎంపీపీ, బీజేపీ నేత తిమ్మాపురం రఘురామిరెడ్డి, కలకడ మండలంలో మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ వంగిమళ్ల మధుసూదన్ రెడ్డి, పీలేరు మండలం తలపుల పంచాయతీ మాజీ సర్పంచ్ అబ్బవరం అమరనాథరెడ్డి లాంటి ప్రజావ్యతిరేకత లాంటి నేతలను పార్టీలోకి ఆహ్వానించి ఆయా ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేసుకున్నారు. ఆయా మండలాల్లోని వైసీపీ ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు పెద్దఎత్తున టీడీపీలో చేరగా, సామాన్య ప్రజలు సైతం స్వచ్ఛందంగా తరలి వచ్చి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సమక్షంలో పసుపు కండువాలు కప్పుకుని ఆయన విజయం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞలు పూనారు.



కిశోర్ కుమార్ రెడ్డి



రామచంద్రారెడ్డి

ఆత్మరక్షణలో వైసీపీ

టీడీపీ సమరోత్సాహంతో కదం తొక్కుతుండగా అధికార వైసీపీ మాత్రం ఆత్మరక్షణలో పడింది. ఎప్పుడు, ఏ మండలంలో ఎవరు పార్టీని వీడుతున్నారో, ఎప్పుడు టీడీపీలో చేరిపోతున్నారో అర్థంకాక ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రభుత్వ వ్యతిరేకత, స్థానిక నేతలపై వైసీపీ క్యాడర్‌లోనే తీవ్రమైన అసంతృప్తి, ఆగ్రహ జ్వాలలు బహిర్గతం అవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు సాగించిన భూఆక్రమణల పర్వం, ప్రశ్నించిన వారిపై దాడులు, అడ్డుకోబోయిన వారిపై అక్రమ కేసుల కారణంగా వైసీపీకి స్వపక్షంలోనే అసమ్మతి ఎదురవుతోంది. దానికి తోడు పదేళ్లు ఎమ్మెల్యేగా కొనసాగినా నియోజకవర్గంపై తనదైన ముద్ర వేసుకోవడంలో చింతల రామచంద్రారెడ్డి పూర్తిగా విఫలమయ్యారు. పార్టీ వ్యవహారాల దగ్గర నుంచి ప్రభుత్వ కార్యక్రమాల వరకు పెద్దిరెడ్డి కుటుంబంపై ఆధారపడడం, ఏ చిన్న పని కోసం ఎవరు వెళ్లినా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఆశ్రయించమని సలహా ఇవ్వడంతో ఆయన పై వైసీపీ శ్రేణుల్లోనే కాకుండా నియోజకవర్గ ప్రజల్లోనూ అసంతృప్తి, అసహనం పెరిగింది. చింతల కేవలం రబ్బరు స్టాంపుగానే మిగిలిపోయారని, తమను నమ్ముకున్న వారి కోసం సొంత అన్నతో విభేదించి మరీ బయటకు వచ్చిన నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని ఈ ఎన్నికల్లో గెలిపిద్దామన్న నిర్ణయానికి నియోజకవర్గ ప్రజలు వచ్చారు.



ప్రసాదరావు, చిత్తూరు ఎంపీ అభ్యర్థి



వరప్రసాద్, తిరుపతి ఎంపీ అభ్యర్థి



ప్రధాని మోదీకి అభివాదం చేస్తున్న చిన్నారి



సభావేదికపై నుంచి అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ
చిత్రంలో జాతీయ టీడీపీ కార్యదర్శి నారా లోకేష్, జనసేనాన నేత నాగబాబు



కిరణ్ కుమార్ రెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి



నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి,
పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి



జయచంద్రా రెడ్డి,
తంబళ్లపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి



రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ



చల్లా రామచంద్రారెడ్డి,
పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి



సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి
ఎమ్మెల్యే అభ్యర్థి



అరవ శ్రీధర్, రైల్వేకోడూరు
ఎమ్మెల్యే అభ్యర్థి

హింసా పాలనను అంతం చేసేందుకే పొత్తు

- మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, మే 8: రాష్ట్రంలో నెలకొన్న హింసాత్మ క పరిపాలనను అంతం చేసేందుకే బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడాల్సి వచ్చిందని మాజీ సీఎం, రాజంపేట పార్ల మెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కలికిరి సమీ పంలోని నగరిపల్లె వద్ద ప్రధాన మంత్రి హాజరైన 'ప్రజాగళం' సభలో ఆయన మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా పెండింగ్‌లో వున్న చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు నరేంద్ర మోదీ మోక్షం కలిగించారని, రాబోయే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్ అమలవు తుందని చెప్పారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నిక ల్లో బీజేపీ 370 సీట్లు సాధిస్తుందని ధీమాగా వుందని, అందులో రాజంపేట సీటు వుండేలా అవకాశం ఇవ్వాలని కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలన రావాలని మూడు పార్టీల నేతలు కృషి చేయాలన్నారు. తనతో పాటు అసెంబ్లీకి టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 12 ఏళ్లు గుజరాత్ సీఎంగా, పదేళ్లు ప్రధానిగా ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా పాలన సాగించడం మోదీకి దక్కిన గౌరవప్రద విజయంగా కొనియాడారు. పీలేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుతున్న అక్రమాలు, అరాచకాల ఆధారంగా పెద్దిరెడ్డిపై ఐదేళ్లుగా అహర్నిశలూ చేసిన పోరాటానికి అండగా నిలబడి కలిసొచ్చిన టీడీపీ నేతలు, కార్యకర్తలకు ఆయన జోహార్లు అర్పించారు. మనమంతా అవిశ్రాంతంగా ఇన్నాళ్లూ ఏకతాటిపై పోరాడాం, నాతోపాటు తన అన్న కిరణ్ కుమార్ రెడ్డిని కూడా గెలిపించాలని కోరారు. పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో అరా చకాలు పరాకాష్టకు చేరుకుని, కులాల మధ్య చిచ్చు పెడుతూ వచ్చారని విమర్శించారు. వైసీపీని ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలు, కబ్జాలు, దుర్మార్గాలను తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రా రెడ్డి ఏకరువు పెట్టారు. తాజాగా ఏడు నెలల గర్భిణి తాగునీటి సమస్య ప్రస్తావిస్తే ఆమెను కాళ్లతో తన్ని గాయపరిచారని గుర్తు చేశారు. శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం కుక్కలు చింపిన విస్తరిలా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో రోడ్డు వేస్తే వైసీపీ ప్రభుత్వం గుంతలు తవ్విందని ఆరోపించారు. ఎంఎల్‌సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏ కులా న్నీ, వర్గాన్నీ వదలకుండా వేధించి హింసిం చడమే పనిగా పెట్టుకుందన్నారు. జనసేన నేత నాగబాబు మాట్లాడుతూ తాను జనసేనానే అయినా మోదీకి అభిమానినని వెల్లడించారు. దేశం గర్వపడే విధంగా మోదీ పాలన సాగిందని కితాబిచ్చారు. శ్రీవాణి టికెట్ల నుంచి అన్నింట్లోనూ టీటీడీని భ్రష్టు పట్టిస్తున్నారని, టీటీడీలో అన్యమతస్థుల ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు. తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వరప్రసాద్, చిత్తూరు టీడీపీ అభ్యర్థి ప్రసాదరావు, కడప టీడీపీ అభ్యర్థి భూపేష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, తిరుపతికి చెందిన జనసేన నాయకుడు హరిప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలను ఏకరువు పెట్టారు. వీటన్నిటికీ ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించడమే శాశ్వత పరి ష్కారమని వారు ఘంటాపథంగా వివరించారు.



సభావేదికపై ప్రధాని మోదీతో మాట్లాడుతున్న నారా లోకేష్
పక్కనే రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి

తెలుగులో ప్రసంగం ప్రారంభం

కలికిరిలో జరిగిన 'ప్రజాగళం' ప్రచార సభలో ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించారు. 'నా ఆంధ్ర కుటుంబసభ్యులందరికీ నమస్కారాలు' అంటూ ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 'ఇది అన్నమయ్య నడయాడిన నేల' అం టూ పదకవితా పితామహుడు అన్నమయ్యను గుర్తు చేసుకున్నారు. తన ప్రసంగం మధ్యలో 'ఆంధ్రప్రదేశ్ వికాసం మోదీ లక్ష్యం', 'ఆంధ్రప్రదేశ్‌లో కూడా డబు ల్ ఇంజన్ సర్కారు రావాలి' 'కిరణ్ కుమార్ రెడ్డి నా మిత్రుడు' అంటూ తెలుగులో మాట్లాడారు. ఆయన తెలుగులో మాట్లాడినప్పుడల్లా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సభకు హాజరైన వారు తమ కేరింతలు, కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

ప్రధాని సభకు జనసందోహం

నిర్వాహకుల అంచనాలను తారుమారు చేసి ప్రధాన మంత్రి సభకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. పీలేరు నియోజకవర్గం నుంచి భారీగా చేరుకున్నారు. కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు, కార్లు, టెంపోల ద్వారా జనం హాజరయ్యారు. సభలో కూడా ప్రధాని ప్రసంగానికి విశేష స్పందన లభించింది. సభకు పెద్ద ఎత్తున జనం చేరుకోవడం వరకూ బాగానే జరిగింది కానీ, సభ పూర్తయిన అనంతరం అక్కడి నుంచి వాహనాలు బయటపడటానికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది. రాత్రి తొమ్మిది తరువాత కూడా ట్రాఫిక్ స్థంభన మధ్య వాహనాలు రోడ్డెక్కడానికి నానా కష్టాలు పడ్డారు. రాత్రి పొద్దుపోయే వరకు కూడా పెద్ద సంఖ్యలో వాహనాలను క్రమబద్ధీకరించడానికి పోలీసులు నిర్విరామంగా కృషి చేస్తూనే కనిపించారు. మొత్తానికి ఊహించిన దానికన్నా రెట్టింపు స్థాయిలో సభ విజయవంతం కావడంతో ఎన్డీయే కూటమి అభ్యర్థుల్లో హుషారు పెంచింది.

43 నిమిషాలు గడిపిన ప్రధాని

కలికిరి ప్రచారసభలో ప్రధాని నరేంద్ర మోదీ 43 నిమిషాలు గడిపారు. రేణిగుంట నుంచి బుధవారం మధ్యాహ్నం 4 గంటలకు హెలీక్యాప్టర్ ద్వారా సభాస్థలికి చేరుకున్న ఆయన వేదిక మీదకు 4.08 గంటలకు చేరారు. వేదిక వద్దకు ప్రధాని రాగానే ప్రజలందరూ లేచి నిలబడి కరతాళధ్వనులతో ఆయనకు స్వాగతం పలికారు. సభకు వచ్చిన తరువాత ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులైన పలువురు మహిళలను సన్మానించారు. 4.22 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభించి 4.50 గంటలకు ముగించారు. 4.51 గంటలకు వేదిక దిగి హెలీప్యాడ్ వద్దకు వెళ్లి 5.04 గంటలకు తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

● రాజంపేట పార్లమెంటు కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి



కలికిరి, మే 8: కలికిరిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు బుధవారం ఊహించిన దానికన్నా ఎక్కువగా ప్రజలు, కూటమి శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేసినందుకు రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు సభ విజయం కోసం కృషి చేసిన వారందరికీ పేరు పేరునా ధన్యవాదాలు చెపుతున్నామన్నారు. కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల నుంచి జన సమీకరణ కోసం శ్రమించిన విషయం మరువలేనిదని పేర్కొన్నారు. ఇదే సహకారం, స్ఫూర్తి పోలింగ్ పూర్తయ్యే వరకూ కొనసాగించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

డబ్బులు పంచుతున్న మున్సిపల్ కౌన్సిలర్‌పై కేసు నమోదు

● రూ. 8,66,500 నగదు స్వాధీనం

మదనపల్లె అర్బన్, మే 8: స్థానిక మున్సిపల్ పరిధిలోని నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరీనగర్‌లో మున్సిపల్ వైసీపీ కౌన్సిలర్ మందపల్లె వెంకటరమణ బుధవారం ఉదయం ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు గుర్తించి కౌన్సిలర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. ఓటర్లకు డబ్బులు పంచుతున్న నలుగురిని ఎఫ్ఎస్‌టీ అధికారిణి శ్రావణి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 8,66,500 స్వాధీనం చేసుకుని ఆ మొత్తాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించామన్నారు. వైసీపీ కౌన్సిలర్ వెంకటరమణతోపాటు డబ్బు లతోపాటు స్లిప్పులు పంచుతున్న చెన్నకేశవ, సహదేవ, చంద్రమోహన్‌కు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పోలీసుల వివరాల మేరకు తన వార్డులో ఫ్యాన్‌గుర్తుకు ఓట్లు వేయాలని ఓటర్లకు డబ్బు తాయిలాల రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గురుఅరవింద్

వాల్మీకిపురం, మే 8: వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో జూన్ 29వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక జడ్జి గురు అరవింద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టులో న్యాయవాదులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జరగాల్సిన లోక్‌అదాలత్ కార్యక్రమం సార్వత్రిక ఎన్నికల కారణంగా వచ్చే నెలకి వాయిదా వేయడం జరిగిందని కక్షిదారులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే న్యాయవాదులు కూడా సహకరించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి వేదికన్నారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, సెక్రటరీ రమణ, ఏజీపీ అశోక్‌కుమార్, న్యాయవాదులు, మండల న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే ధ్యేయం



ప్రచారం చేస్తున్న తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌బాషా

కురబలకోట, మే 8:ఎన్నికల్లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయమని రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌బాషా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముదివేడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో కూటమి అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. కూటమి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్య క్రమంలో బాలకృష్ణ, మధుకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటరమణారెడ్డి, మోహన్‌రెడ్డి, గోపాల్, చంద్ర, రమణ, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను ఆదరించి.. గెలిపించండి



ప్రశాంతనగర్‌లో పచారం నిర్వహిస్తున్న నాయకులు

మదనపల్లె అర్బన్, మే 8: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆద రించి.. గెలిపించాలని బుధవారం కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేస్తూ కూటమి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారికిరణ్‌కుమార్‌రెడ్డిని, మదనపల్లె అసెంబ్లీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు ఓటర్ల ను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా మాట్లాడుతూ ప్రజా సమంక్షేమాన్ని అందించే టీడీపీకి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో దౌర్జన్యం, దోపిడి పాలన, అక్రమార్జన పాలన పోవాలంటే చంద్రబాబునాయుడుని గెలిపించుకుని సీఎం చేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధి చూడాలన్నా దోపిడీ జగన్‌ను ఇంటికి సాగనంపాలని ఓటర్లను కోరారు. కార్యక్ర మంలో షంషీర్, మార్పూరి నాగార్జునబాబు (గాంధీ), నాదేళ్లబాబునాయుడు, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజాగళం మహాసభకు తరలిన కూటమి నేతలు

నిమ్మనపల్లి, మే 8: కలికిరిలో బుధవారం నిర్వహించిన ప్రధాని మోదీ, టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేష్ ప్రజాగళం మహాసభకు మండలం నుంచి టీడీపీ, బీజేపీ. జనసేన కూటమి నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13న జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, షాజహాన్‌బాషాలను భారీ విజయం సాధిస్తారన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు విసుగుచెందారని తెలిపారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలే ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తాయని తెలిపారు. ప్రజాగళంసభకు వెళ్లిన వారిలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, రాజంపేట అధికార ప్రతినిధి ఆర్టే వెంకటేష్, మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి, బీసీ అధికార ప్రతినిధి లక్ష్మన్న, సర్పంచ్ రెడ్డెప్ప, మాజీ ఎంపీపీ రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు రాజన్న, రమణ, మల్లప్ప, మహమ్మద్‌రఫీ, శ్రీరాములు, మల్లికార్జున, నాయకులు సునీల్‌రెడ్డి, మురళి, కేశవ, గోపాల్‌క్రిష్ణ, చంద్రసింగ్, సోము, శ్రీనివాసులు, నరసింహులు, శ్రీపతి, సుధాకర్, సహదేవ, జగదీష్, రెడ్డెప్ప, జయన్న, చినబాబు, చెంద్రాయుడు, ఖసింమ్‌ఖాన్, బాబు, చంద్ర ఉన్నారు.

గుర్రంకొండలో: దేశ ప్రధాని నరేంద్ర మోదీ కలికిరి పర్యటనకు గుర్రంకొండ నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తరలివెళ్లారు. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల్లో వేలాదిగా మోదీ సభకు వెళ్లారు. ప్రతి గ్రామం నుంచి పదుల సంఖ్యలో వాహనాలు సభకు వెళ్లడం కూటమి అభ్యర్థుల్లో గెలుపు దీమాను కనబరుస్తోంది.



కలికిరి ప్రజాగళం సభ వద్ద తంబళ్లపల్లె కూటమి నాయకులు

తంబళ్లపల్లెలో: రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమేనని తంబళ్లపల్లె కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కలికిరిలో ప్రధాని మోదీ ప్రజాగళం బహిరంగ సభకు తంబళ్లప ల్లె నుంచి కూటమి నాయకులు భారీగా తరలివెళ్లారు. బుధవారం ఉదయం మండలంలో పలు గ్రామాల నుంచి బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో నినాదాలు చేసుకుంటూ ఉత్సాహంగా కలికిరి సభకు భారీగా తరలి వెళ్లారు.



వాల్మీకిపురం నుంచి మోదీ సభకు బయలుదేరిన నాయకులు

వాల్మీకిపురంలో: కలికిరిలో బుధవారం నిర్వహించిన ప్రధాని మోదీ బహిరంగ సభకు వాల్మీకిపురం మండలం నుంచి భారీ సంఖ్యలో నాయకులు తరలివెళ్లారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి భారీగా వాహనాలలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత భారీగా తరలి వెళ్లారు.

ములకలచెరువులో భారీ వర్షం



కన్నెమడుగువారిపల్లె వద్ద దెబ్బతిన్న మొక్కజొన్న పంట

ములకలచెరువు, మే 8: ములకలచెరువులో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. సుమారు 3 గంటల సమయంలో ఈదురుగాలతో కూడిన భారీ వర్షం కురియడంతో పంటలకు నష్టం వాటిల్లింది. అలాగే పలు గ్రామాల్లో కూడా భారీ వర్షం కురిసింది. దీంతో మామిడి తోటల్లోని మామిడి రాలి కాయల రాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని పర్తికోట పంచాయతీ కన్నెమడుగువారిపల్లె సమీపంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతింతి. దీంతో రైతు బాలకృష్టారెడ్డికి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. వర్షంతో ఎండ తీవ్రత నుంచి కొంత ఉపశమనం కలిగింది. ములకలచెరువులో కురిసిన వర్షం 49.4 మి.మీటర్లుగా నమోదైంది.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట మండలంలో మంగళవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎండ తాకిడికి అల్లాడిపోతున్న జనానికి ఊరట లభించినట్లయింది. మదనపల్లె డివిజన్‌లోనే అత్యధికంగా బి.కొత్తకోట మండలంలో 80.0 మిమీ ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. పెద్ద ఎత్తున వర్షం పడినప్పటికీ ఎటువంటి ఆస్థినష్టం జరగలేదని తహశీల్దార్ పుణ్యవతి తెలిపారు. కాగా పట్టణంలోని వాయిలవంక వీధిలో తోపుడుబండి పై వ్యాపారం చేసుకునే టి.నయాం నివాసగృహానికి వున్న పైకప్పు ముందుభాగం కూలిపోయింది. కుటుంబీకులకు ఎటువంటి అపాయం జరగలేదు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు అవార్డులు

మదనపల్లె అర్బన్, మే 8: ఆర్టీసీలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఉద్యోగులకు బుధవారం వన్ డిపో మేనేజరు మూరే వెంరటరమణారెడ్డి నగదు అవార్డులను అందజేశారు. ఏప్రిల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన కెమల్లికార్జున, ఆంజనేయులు, ఎస్వీ రమణ, నాగరాజ, పీవీబీరెడ్డి, అబ్రహాం, బయ్యారెడ్డి, గ్యారేజ్ సూపర్‌వైజర్ మురళి, మెకానిక్ ఖలీల్‌లను ఆయన అభినందించారు.

ఇకపై పీహెచ్‌సీల్లో ఉచితంగా స్కానింగ్

అన్నమయ్య జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఉష శ్రీ



వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ ఉషశ్రీ

రాయచోటిటౌన్, మే 8: ఎంపిక చేసిన పీహెచ్‌సీలలో ఇకపై ఉచితంగా స్కానింగ్ సౌకర్యం అందుబాటులోకి రా నుందని అన్నమయ్య జిల్లా పీసీపీఎన్‌డీటీ చట్టం (గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం) నోడల్ అధికారి డాక్టర్ ఉష శ్రీ అన్నారు. బుధవారం ఆమె జిల్లా కేంద్రం లోని డీఎం హెచ్‌వో కార్యాలయంలో డీఐవో అధ్యక్షతన మొలకల చెరువు, కురబలకోట, పెద్దమండెం, పీటీయం, నందలూర్, చిట్వేల్, రామాపురం, గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా పీహెచ్‌సీల లో గర్భిణులకు స్కాన్ చేసే సౌకర్యం ఏర్పాటు చేస్తున్నా మన్నారు. ఇందుకు గానూ సంబంధించిన పీహెచ్‌సీల వైద్యులకు పీసీపీఎన్ డీటీ చట్టం ప్రొటోకాల్, ప్రమాణాల కు సంబంధించి ఆయా పీహెచ్‌సీలు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి పీసీపీఎన్ డీటీ చట్టం అమలు సభ్యులు డాక్టర్ వెంకటశివ, డాక్టర్ జీనత్‌బేగం, డిప్యూటీ డెమో దేవశిరోమణి, పాల్గొన్నారు.

రోడ్డెక్కిన టమోటా రైతులు

● లారీ అసోసియేషన్‌కు వ్యతిరేకంగా నిరసన ● మార్కెట్ చైర్మన్‌ను నిలదీసిన వైనం ● ఆలస్యంగా ప్రారంభమైన వేలంపాటలు



టమోటాలు రోడ్డుపై పోసి నిరసన చేస్తున్న రైతులు



మార్కెట్ కమిటీ చైర్మన్‌ను అడ్డుకుని సమస్యలు తెలుపుతున్న రైతులు

మదనపల్లె అర్బన్, మే 8: టమోటా మార్కెట్‌లో లారీ అసోసియేషన్ జోక్యాన్ని నిరసిస్తూ టమోటా రైతులు ఆందోళన చేపట్టారు. ఇక్కడి నుంచి టమోటాలను కొనుగోలు చేసి బయటి ప్రాంతానికి తరలించేందుకు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న లారీలను అడ్డుకోవడం వివాదానికి దారితీసింది. బయటి నుంచే లారీలను తరచూ అడ్డుకోవడం, దీనికి ప్రతిగా వ్యాపారులు వేలంపాటలు నిలిపేయడం, తద్వారా రైతులు రోడ్డుపైకి రావడం తరచూ జరుగుతోంది. ఇదే క్రమంలో బయట నుంచి వచ్చిన అయిదు లారీలను మదనపల్లె లారీఅసోసియేషన్ అడ్డుకోవడం, ఆ లారీలను తమ కార్యాలయం అసోసియేషన్ కార్యాలయానికి తీసుకెళ్లడం వివాదానికి కారణమైంది. దీన్ని నిరసిస్తూ అటు బయటి వ్యాపారులు ఇక్కడి రైతులు మార్కెట్‌కు తెచ్చిన టమోటాలను కొనుగోలు చేయకుండా నిలిపివేశారు. వ్యాపారులు వేలంపాటలు నిలిపివేయడంతో రైతులు మార్కెట్ రెండు గేట్లు మూసేసి వాహనాలను లోనికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. మరోవైపు టమోటాలను రోడ్డుపై పోసి, అటు వ్యాపారులు, ఇటు లారీఅసోసియేషన్ తీరుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తెస్తే, అటు వ్యాపారులు, ఇటు లారీ అసోసియేషన్ నాయకులు తమను తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. రైతు మార్కెట్‌లో అసోసియేషన్, రాజకీయ నాయకులకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2:30గంటల వరకూ జరిగిన ఆందోళనలో కిలోమీటర్ల దూరం వాహనాలు ఆగిపోయి ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం ఏర్పడింది. ఇంత జరుగుతున్నా..టమోటా మార్కెట్ కార్యదర్శి అభిలాష్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని రైతులు తప్పుపట్టారు. ఆయన పనితీరుపై రైతులు, వ్యాపారులు మండిపడ్డారు. అక్కడికి చేరుకున్న పోలీసులు రైతులను అడ్డుకోవడంతో ఇక్కడి నుంచి ఆందోళనను అన్నమయ్య సర్కిల్‌కు మార్చి రోడ్డుపై బైఠాయించి రోడ్డుపై డ్రమ్ములు పెట్టి వాహనాలను అడ్డుకున్నారు. అక్కడ కూడా ఇదే స్థాయిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆలస్యంగా చేరుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డిని రైతులు చుట్టుముట్టారు. ఉదయం 10గంటలకు జరగాల్సిన వేలంపాటలు నిలిచిపోయి, రైతులు రోడ్డుపై ఆందోళన చేస్తుంటే, పత్తా లేకపోవడాన్ని ప్రశ్నించారు. వైసీపీ నాయకులే, లారీ అసోసియేషన్‌కు మద్దతుగా ఉన్నారని, అందుకే వ్యాపారుల లారీలను తీసుకెళ్లి ధైర్యంగా అసోసియేషన్ కార్యాలయంలో పెట్టారని చైర్మన్‌ను నిలదీశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాను మార్కెట్‌కు రాలేదని, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తమతోపాటే రోడ్డుపై బైఠాయించాని సూచించారు. అనంతరం అక్కడికి పోలీసులు చేరుకుని రైతులతో, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తిరిగీ మధ్యాహ్నం 2:30గంటలకు వేలంపాటలు నిర్వహించారు. కాగా సమస్య పునరావృతం కాకుండా అధికారులు, వ్యాపారులు చర్చిస్తున్నారు.

తంబళ్లపల్లెలో 32 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలింగ్

తంబళ్లపల్లె, మే 8: తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి నాలుగో రోజు బుధవారం 32 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కువినియోగించుకున్నట్లు ఏఆర్వో బ్రహ్మయ్య తెలిపారు. తంబళ్లపల్లె తహసీల్దారు కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 1659 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా మొదటి రోజున 998 మంది, రెండో రోజున 498 మంది, మూడో రోజున 37 మంది, నాలుగవ రోజున 32 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగిం చుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

కన్నుల పండువలా వేణుగోపాలుడి కల్యాణం

కురబలకోట, మే 8: కురబలకోట మండలం తెట్టులో వెలసిన సంతాన వేణుగోపాల స్వామి వారి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా కన్నుల పండువలా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న తిరుణాలకు బుధవారం నుంచి ప్రారంభం కావడంతో చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఆలయంలో సంతాన వేణుగోపాల స్వామి అమ్మవారిని ఆలయ పండితులు ప్రత్యేకంగా అలంకరించి సాంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కాగా తిరుణాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాట్లను చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

బోయకొండ గంగమ్మకు ఘనంగా బోనాలు



ఆలయంలో రజకసంఘాల సమాఖ్య రాష్ట్రఉపాధ్యక్షుడు నాగయ్య తదితరులు

మదనపల్లె అర్బన్, మే 8: స్థానిక అన్నమయ్యసర్కిల్ సమీపంలోని దోబీఘాట్, బోయకొండగంగమ్మ ఆలయంలో శ్రీరామ రజకసంఘం అధ్యక్షుడు కె, వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించారు. ఉదయాన్నే చౌడేశ్వరీ కళ్యాణమండపం సర్కిల్ నుంచి మహిళలు దీలు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి బోయకొండ గంగమ్మకు సమర్పించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు చీర, పసుపు, కుంకుమ, గాజపులు అమ్మవారికి అందజేశారు. ప్రతి ఏటా దేవర్లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు, కార్యక్రమంలో నాగరాజ, లక్ష్మీదేవి, చిన్నమ్మ, ఈశ్వరమ్మ, వేణు, నారాయణ, చలపతి, హేమావతి, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ముగ్గురికి తీవ్రగాయాలు



కలికిరి ఆసుపత్రిలో ఘటనపై వివరాలు తెలుసుకుంటున్న రఘురామి రెడ్డి

కలికిరి, మే 8: విద్యుదాఘాతంతో కేవీపల్లె మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన జాఫర్ (38)అనే వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన అఫ్జల్ (20), వారాది (58), షఫీ (45)లు కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం నగరిపల్లె వద్ద జరిగిన ప్రధాన మంత్రి సభ పూర్తయిన అనంతరం జెండా కర్రలు తీసుకుని ఆటోలో బయలుదేరారు. విద్యుత్ వైరుకు జెండా కర్ర తగలడంతో ఒక్కసారిగా నలుగురూ విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ జాఫర్ మృతి చెందాడు. మరో ముగ్గురు కోలుకుంటున్నారు. సమాచారం అందిన వెంటనే మండల టీడీపీ సీనియర్ నాయకుడు రఘురామి రెడ్డి ఆసుపత్రికి చేరుకుని బాధి త కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ మేరకు కలికిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం నాటుసారాను ఉపేక్షించొద్దు



ఎస్ఈబీ సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

వాల్మీకిపురం, మే 8: ఎన్నికల సమయంలో నాటుసారా, అక్రమ మద్యం పట్ల ఉక్కుపాదం మోపాలని ఎలాంటి పరిస్థితుల్లో వాటిని ఉపేక్షించొద్దని అనంతపురం సబ్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ ఆదేశించారు. బుధవారం ఆయన వాల్మీకిపురం ఎస్ఈబీ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక సీఐ సునంద, ఎస్ఐ షేక్ షావలి పాల్గొన్నారు.

ఎస్ఈబీ స్టేషన్‌ను సందర్శించిన డిప్యూటీ కమిషనర్

పీలేరు, మే 8: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాయలసీమ జోన్ డిప్యూటీ కమిషనర్ టి.విజయశేఖర్ బుధవారం పీలేరు ఎస్ఈబీ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం నివారణ, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు, పాటించాల్సిన నిబంధనల గురించి సిబ్బందికి వివరించారు. అనంతరం చిత్తూరు మార్గంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును సందర్శించి అక్కడ జరుగుతున్న వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ శ్యాంప్రసాద్, ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది యోగానంద, గిరిబాబు, సుధాకర, సురేశ్, రమేశ్, జయభాను, గంగా మహేశ్వరి, పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం, మే 8: వాల్మీకిపురం పట్టణ సమీపంలోని ఏపీ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5 నుంచి 8 తరగతులలో చేరుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నవమల్లిక పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థినులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా పాఠశాలలో చేరుటకు అవకాశం కల్పించడం జరుగుతోందన్నారు. దరఖాస్తులు, సర్టిఫికెట్‌ల జిరాక్స్ కాపీలను పాఠశాలలో నేరుగా గానీ రిజిస్టర్ పోస్టు ద్వారా కానీ ఈనెల 31లోపు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 8712625052 నెంబరును సంప్రదించగలరన్నారు.

12న రైల్వేకోడూరుకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మే8: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ నెల 12వ తేదీన రైల్వేకోడూరుకు మదనపల్లె వన్ డిపో నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతునట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 4.30 నుంచి సాయంత్రం 5 గంటలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతామన్నారు. ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను కేటాయించినందుకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సుల నడుపుతున్నట్లు చెప్పారు.

తంబళ్లపల్లెలో కూటమి విజయం తథ్యం

● అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి సతీమణి కల్పనారెడ్డి ధీమా



పట్టెంవాండ్లపల్లె గ్రామం కమ్మచెరువులో ప్రచారం నిర్వహిస్తున్న కల్పనారెడ్డి

పెద్దతిప్పసముద్రం మే 8 : తంబళ్లపల్లె నియోజ కవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి విజయం తథ్యమని జయచంద్రారెడ్డి సతీమణి కల్పనారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆమె కూటమి అభ్యర్థులతో కలసి పీటీఎం మండలం లోని పట్టెంవాండ్లపల్లె గ్రామంలోని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రంగసముద్రం విసనకర్ర వాండ్లపల్లెలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో నియంత పాలన పోవాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రచార కార్యక్రమంలో రంగసముద్రం టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు తోట అంజనేయులు, సీనియర్ టీడీపీ నాయకులు రాగిపాళ్యెం బావన్న, లక్ష్మీనరుసు, నచ్చు చలపతి, సయ్యద్ ఉసేన్, అంజనేయరెడ్డి , ప్రభాకర్‌రెడ్డి, దస్తగీర్, బావాజాన్, ఆదేన్న, బైరగాని ఆంజనేయులు, మహబూబ్ బాష, టైలర్ మహబూబ్‌బాష, చాంద్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: కూటమి ప్రభుత్వం రాగానే సామాజిక పింఛను రూ.4వేలను ఇంటికే చేరుస్తామని తంబళ్లపల్లె టౌన్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కూటమి మేనిఫెస్టోను కరపత్రాల ద్వారా ఓటర్లకు వివరించారు. 13న జరుగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా దాసరిపల్లె జయచంద్రారెడ్డిని, కమలం గుర్తుకు ఓటేసి ఎంపీగా కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుయువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, మాజీ ఉపసర్పంచ్ సుబ్రమణ్యం, సాంబశివారెడ్డి, బాలకృష్ణ, శీన, మునాఫ్, రామకృష్ణ, శంకర, సుబహాన్, నరేంద్రనాయుడు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇదీ మందు



'ఏందప్పా.. మేం ముష్టోల్లలా కనబడ్తా వుండామా మీ పాపిస్టి కళ్లకు.. ఎల్లండెల్లప్పా' అని కసిరి తరిమేస్తా వుండారంట జనాలు. 'పది ఎయ్యిలకు తక్కువిస్తే ఊరుకునేది లేదప్పా. మేం తగ్గేదే ల్యా' అని అడ్డం తిరిగి కూర్చుంటా వుండారంట. ఇంతకీ సంగతేంది అంటారా. కుప్పంలో అతికార పార్టీ వోల్లు మూటలు ఇప్పేశారని బుదారం పద్దన్నే గుప్పుమని పొయ్యింది. సోమారం రేతినింకానే ఓటుకు నాలుగు ఎయ్యిలు పంచడం స్టార్ట్ అయిపొయ్యిందంటా జనాలు చెవులు కొరుక్కునేసినారు. ఇది నిజ్జమేనని నమ్మబలకేవోల్లు ఎక్కువైపొయ్యినారు. నిజిమేందో, అబద్ధమేందో ఆ గంగమ్మకు ఎరకకానీ, కుప్పం ప్రజలు మాత్తరం కొండెక్కి కూకునేసినారు. మరీ పల్లెటూల్ల జనాలు అగ్గిమీద గుగ్గిలం అవతా వుండారు. 'కుప్పం టౌనోల్లు అంత తీపి, మేమంటే మేంటే అంత చేదెందుకు మీకు?' అని అతికార పార్టీవోల్లని నిలదీస్తా వుండారంట. కుప్పం నియోజకొర్గంలోని పల్లెటూల్ల ప్రెజల ఆగ్రహానికి కూడా మంచి కారణమే ఉండాది. మొన్న కుప్పం మున్సిపల్ ఎలచ్చన్లలో అతికార పార్టీవోల్లు టౌనోల్లకు ఓటుకు తలా అయిదు ఎయ్యిలు కాసులు పంచేసిండ్లా. అదింకా మర్సిపోలా జనాలు. ఎమ్మెల్లే ఎలచ్చన్లకు కనాకస్టం పది ఎయ్యిలు ఇస్తారని గెట్టిగా డిసైడ్ పొయ్యివుండారు గదా అప్పుటినింకా. ఇప్పుడు పది ఎయ్యిలు కాదు కదా, టౌనోల్లకంటే మున్సిపాలిటీ ఎలచ్చన్లలో టౌనోల్లకిచ్చిన కాసుల్లో ఎయ్యి తగ్గించేసి నాలుగు ఎయ్యిలే ఇస్తామంటే ఒల్లు మండదా ఎవుర్కైనా. మల్లీ ఇంకోమాట కూడా ఇనిపిస్తావుండాదప్పా. ఏం లేదు.. ఈ నాలుగు ఎయ్యిలు కూడా ఇస్తావుండేది కుప్పం టౌనోల్లకేనంట. పల్లెటూళ్లల్ల ఓటుకు మూడు ఎయ్యిలే ఇస్తావుండారని ప్రెచారం జరగతా వుండాది. ఈ ప్రెచారంతో అగ్గిమీద గుగ్గిలం అయిపోతా వుండారంట పల్లె జనాలు. పంపకాలకు వొచ్చినోల్లపైన తిరగబడతా వుండారంట. 'పది ఎయ్యిలకు తగ్గేదే ల్యా' అనేసి అల్లు అర్జున్ మాదిర్తో గెడ్డం కింద చెయ్యిపెట్టి తలెగరేస్తావుండారంట. అదప్పా.. సంగతి.

- కుప్పం

ఈ మధ్యనే మాట్లాడాడే.. ఏమైంది?



గ్రామాల్లో ఎవరైనా మరణించారన్న విషయం తెలిస్తే చాలు.. వివిధ పార్టీలకు చెందిన నేతలు పూలమాలలతో వచ్చేస్తున్నారు. నివాళులర్పిస్తున్నారు. 'అన్నా ఏమైంది నాన్నగారికి. ఈ మధ్యనే చూసి మాట్లాడించాను. అంతలోనే ఏం జరిగింది? అయ్యో మంచి వ్యక్తన్నా. పదిమందికి సాయపడాలనుకునేవాడు. మేముండంగానియన్నా మేంచూస్కుంటాం. ఏంభయపడదొద్దు మనపార్టీలోని ఫలానా నేతకు చెప్పి మావంతు తోడ్పాటు అందిస్తాం' అంటూ మృతుల కుటుంబీకులను పరామర్శిస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో మరణించిన వ్యక్తి ఏ పార్టీకి సానుభూతిపరుడో అన్నది కూడా చూడటం లేదు. పరిచయంతో పనిలేదు. ఇదంతా ఎందుకంటే.. మృతుడి కుటుంబసభ్యులతోపాటు వారి బంధువులు, మిత్రులు, తెలిసినవారు దాదాపుగా వందమంది ఒక దగ్గర చేరే అవకాశం ఉంటుంది. తాము వెళ్లడం వల్ల వారిలో తమపార్టీకి సానుకూలత ఏర్పడి ఓట్లుగా మారతాయన్నది వీరి ఆశాభావం. కొన్నిచోట్ల అంత్యక్రియల ఖర్చుకంటూ కొంత మొత్తం కూడా ఇస్తున్నారు.

- గంగాధరనెల్లూరు

జన కేతనం

www.andhrajyothy.com
గురువారం 9 మే 2024

ఛాలెంజ్ ఓటు అంటే....?



ఓటర్ల జాబితాలో పేరున్నా... ఓటు వేసేందుకు అనర్హుడని రాజకీయపార్టీల ఏజెంట్లు సవాలు చేయడాన్ని ఛాలెంజ్ ఓటు అంటారు. ఓటేయడానికి వచ్చిన ఎవరినైనా పోలింగ్ కేంద్రంలోని ఏజెంట్లు అనుమానించి, ఆ వ్యక్తి నకిలీ అని అభ్యంతరం ప్రకటిస్తారు. అది తన ఓటే అని ఓటేయడానికి వచ్చినవారు చెబితే, ఫిర్యాదు చేసిన ఏజెంటు నుంచి రూ.5 డిపాజిట్‌గా అక్కడి అధికారి తీసుకుంటారు. ఆ తర్వాత ఈవీఎంలో గాక బ్యాలెట్ పేపర్ ఇచ్చి రహస్య పద్ధతిలోనే ఓటేయమంటారు. దాన్ని జాగ్రత్త పరుస్తారు. ఆ ఓటరు నకిలీనో కాదో స్థానిక సిబ్బందితో ప్రాథమిక విచారణ జరిపిస్తారు. అతని పేరు, వయస్సు, తండ్రి పేరు, చిరునామా, ఫోటో తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ అయితే ఆ ఓటును లెక్కింపులోకి స్వీకరిస్తారు. బోగస్ అని తేలితే మాత్రం అధికారులు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

- తిరుపతి కలెక్టరేట్


కొండలకు గుండు చేసిన స్వామి

● నోరు పారేసుకోవడం తప్ప జీడీనెల్లూరుకు చేసిందేమిటి?

కథనం - వెదురుకుప్పం

మీ కుమార్తెకు ఓటెందుకెయ్యాలి?

'ఎక్సైజ్ మంత్రిగా మీరు మద్యనిషేధం అమలు చేయనందుకా? మీ నియోజకవర్గంలో బెల్టు షాపులను నియంత్రించలేకపోయినందుకా? సారా తయారీ, విక్రయాల కట్టడిలో విఫలమైనందుకా? హామీలను నెరవేర్చనందుకా? అభివృద్ధిని పట్టించుకోనందుకా? కొందరు అవినీతి అధికారులకు.. కొండలు చదునుచేసి కబ్జా చేసిన అనుచరులకు అండగా నిలబడినందుకా? మీరేం చేశారని.. మీ వారసురాలికి ఓటేయాలి' అంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



'పేదలపాలిట మహమ్మారిలా మారిన మద్యాన్ని సంపూర్ణంగా నిషేధించిన తర్వాతే 2024లో ఓట్లు అడుగుతా'

● అనేక సభల్లో జగన్‌రెడ్డి దబాయించి ఇచ్చిన ఈ హామీని ఆయనా అమలు చేయలేదు. ఆయన మంత్రివర్గంలో ఎక్సైజ్ మంత్రిగా పనిచేసిన నారాయణస్వామి నిషేధం గురించి ఎన్నడూ నోరు తెరవలేదు. తమకు బైబిల్, ఖురాన్, భగవద్గీత అనిచెప్పే మేనిఫెస్టోలో ధాటీగా ప్రకటించిన మద్యనిషేధాన్ని కనీసం కూడా అమలు చేయకుండానే వీరు నిస్సిగ్గుగా ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారు. మద్యం ధరలు పెంచి, చవకరకం మద్యం షాపుల్లో పెట్టి, ప్రభుత్వమే మద్యం అమ్మి ఇబ్బడి ముబ్బడిగా ఆదాయం పెంచుకునే ప్రణాళికలు వేసి అమలు చేసిన వీరు తమ ముందుకొచ్చి ఓట్లు అడుగుతున్న తీరు చూసి జనం ఔరా అని ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గం నుంచి నారాయణస్వామి పోటీలో లేరు గానీ ఆయన కుమార్తె కృపాలక్ష్మిని బరిలో దించి ఆయనే మొత్తం బాధ్యత భుజాన వేసుకున్నారు. పల్లె పల్లె ఇల్లిల్లూ తిరుగుతున్నారు. నిత్యం జగన్ భజన చేస్తూ, సందు దొరికతే వయసు కూడా మరిచి ఆయన కాళ్లకు నమస్కరిస్తూ, జగన్‌కి తన చర్మంతో చెప్పులు కుట్టిస్తానని చెప్పి దళితుల ఆత్మ గౌరవాన్ని పదవి కోసం తాకట్టు పెకట్టేసిన నాయకుడిగా విమర్శలకు గురవుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి.. తాను చేసిన అభివృద్ధిని చూసి తన కుమార్తెకు ఓట్లేయమని అడుగుతున్నారు. ఇంతకీ డిప్యూటీ సీఎం పదవిలో ఉండి ఆయన జీడీ నెల్లూరు నియోజకవర్గంలో చేసిందేమిటి? సాధించిన అభివృద్ధి ఏమిటి? అనే చర్చ జరుగుతోంది.

డిప్యూటీ సీఎం అయ్యాక మారిన మాట

డిప్యూటీ సీఎం అయ్యాక నారాయణస్వామి మాట మారింది. ఏ చిన్న సమావేశమైనా, ప్రెస్ మీట్ అయినా తొలుత టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్, ప్రముఖ మీడియా సంస్థల యజమానులను దూషించడం పరిపాటిగా మారింది. అభివృద్ధి.. తన మంత్రిత్వ శాఖకన్నా ప్రతిపక్ష నాయకుల మీద దుమ్మెత్తి పోయడానికే ప్రాధాన్యమిచ్చారు. సొంత పార్టీలోనూ 'పెద్ద' రెడ్లకు భజన చేయడం.. సీఎం కాళ్లపైన పడే ఈయన.. స్థానిక రెడ్లపై నోటి దురుసు చూపుతారనే విమర్శలున్నాయి. దీనిపై స్వపక్షాల్లోనూ ఆక్షేపణలు వచ్చినా.. ఆయన తీరు మారలేదు. ఆయన వ్యవహార శైలితో సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. పెనుమూరుకు చెందిన ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, అతడి వర్గీయులు అసమ్మతిగా మారారు. ఈయనకు టిక్కెట్ రాకుండా ప్రయత్నించారు. అటు ఇటు పోయి చివరికి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మికి అధిష్ఠానం టికెట్ ఇచ్చింది.

● అక్రమ కేసులతో అణగదొక్కాలని...

తన ఇంటికి రోడ్డు వేయలేదని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రశ్నించిన కార్వేటినగరం మండలంలోని ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయించి, కేసు నమోదు చేయించారు. వైసీపీలోని వ్యతిరేక వర్గీయులపైనా కేసులు పెట్టించారు. పలు మండలాల్లో మీడియా ప్రతినిధులపైనా అక్రమ కేసులను బనాయించడంలో కీలకపాత్ర పోషించారు. తన మాట వినని తహసీల్దార్లు, ఎస్‌ఐలను తరచూ బదిలీలు చేయించేవారు. అనుకూలంగా ఉన్న వారు ఏం చేసినా వెనకేసుకొచ్చేవారు.

● జనం చెవిలో 'స్వామి' పూలు

హామీ: జీడీనెల్లూరు, పెనుమూరు, కార్వేటినగరంలోని పీహెచ్‌సీల స్థాయిని పెంచి 50 పడకల ఆస్పత్రులుగా అభివృద్ధి చేస్తా.
అమలు తీరు: పెనుమూరు, కార్వేటినగరం ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. కార్వేటినగరంలో నిర్మాణ దశలో ఉండగా, పెనుమూరులో పునాది దశలో ఉంది. జీడీనెల్లూరుకు మంజూరు కాలేదు.





హామీ: పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం నుంచి నియోజకవర్గంలోని 32 చెరువులకు నీటిని అనుసంధానిస్తా. పెనుమూరు, గంగాధరనెల్లూరు మండలాల్లో సుమారు 60 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తా.
అమలు తీరు: ఐదేళ్ల పూర్తయి మళ్లీ ఎన్నికలొస్తున్నా చెరువుల అనుసంధానమనే ఊసే లేదు.

హామీ: పెనుమూరులో పాలిటెక్నిక్ మంజూరు చేయిస్తా.
అమలు తీరు: ఇంతవరకు అతీగతి లేదు.

హామీ: జీడీనెల్లూరు మండలం కలిజవేడు, కొత్తకోన పంచాయతీ మధ్యలో నీవానదిపై లోలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడతా.
అమలు తీరు: అధికారులు పరిశీలించారే కానీ పనులు మొదలు కాలేదు. వరదలొస్తే ఆ గ్రామాల ప్రజలు నది దాటేందుకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

హామీ: జీడీనెల్లూరు మండలం మోతరంగనపల్లెలో ఫ్యాక్టరీలను తెచ్చి శ్రీసిటీ తరహాలో అభివద్ధి చేస్తా.
అమలు తీరు: చిత్తూరు- పుత్తూరు రహదారి పక్కనున్న ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీల కోసం గతంలోనే స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తానన్న ఒక్క లెదర్ ఫ్యాక్టరీని కూడా ఏర్పాటు చేయలేకపోయారు.



హామీ: పచ్చికాపల్లం నుంచి కొత్తపల్లిమిట్ట వరకు రోడ్డు విస్తరిస్తా.
అమలు తీరు: వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం నుంచి దేవళంపేట మీదుగా ఎస్‌ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్ట వరకు రోడ్డు విస్తరణ పనులు చేయలేదు. కాకపోతే మరమ్మతులు జరిగాయి.

హామీ: కార్వేటినగరం మండలం కృష్ణాపురం, ఎర్రమరాజుపల్లె సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్లను మంజూరు చేయిస్తా.
అమలు తీరు: ఇప్పటికీ మంజూరు కాలేదు.

ప్రాజెక్టుల కథ కంచికే...!

హామీ: పాలసముద్రం మండలం నరసింహాపురం సమీపంలో మామిడిమాను మడుగు వద్ద మినీ రిజర్వాయర్ నిర్మిస్తా.
అమలు తీరు: ఈ ప్రాంతంలో పడిన వర్షపు నీరు తమిళనాడుకు తరలిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మించి తిరుమలరాజుపురం, కోదండరామాపురం, గంగమాంబాపురం, నరసింహాపురం రైతులకు ప్రయోజనం చేకూరుస్తామన్నా హామీ నేటికీ నెరవేరలేదు.

హామీ: కార్వేటినగరం మండలం దాసరినత్తం వద్ద మినీ రిజర్వాయర్ మంజూరు చేయిస్తా.
అమలు తీరు: ఈ హామీ కూడా కలగానే మిగిలింది.

హామీ: వెదురుకుప్పం మండలం బొప్పలమడుగు సమీపంలో మినీ ప్రాజెక్టు మంజూరు చేయిస్తాను.
అమలు తీరు: ఈ రోజుకూ కార్యరూపం దాల్చలేదు.



క్రీడాకారుల ఆశలు ఆవిరి

హామీ: వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాకారులకు మినీ స్టేడియం ఏర్పాటు చేయిస్తా.
అమలు తీరు: మండలంలో వివిధ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు చాలా మంది ఉన్నప్పటికీ మినీస్టేడియం కార్యరూపం దాల్చలేదు.

కొండలు చదును చేసేశారు

తనలో ఎంత వెతికినా అవినీతి మచ్చ కనబడదంటారు. విపక్షాలకు సవాళ్లు విసురుతారు. లంచం అడిగారో ఖబడ్దార్ అంటూ అధికారులను హెచ్చరిస్తారు. కానీ, ఆయన అనుచరులు ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేశారు. ఇక, కొండల్ని చదును చేసి మొక్కలు నాటి సొంతం చేసుకున్నారు. దీనికి డిప్యూటీ సీఎం మద్దతు ఉందన్న ఆరోపణలున్నాయి.

● వెదురుకుప్పం మండలం జక్కిదొన ప్రాంతంలో పాండురాజు గుట్ట సుమారు 16.23 ఎకరాల్లో ఆక్రమణలు జరిగాయి. ఆ ప్రాంతంలోనే సర్వే నంబరు 828లో 7.22 ఎకరాల గుట్ట కూడా ఆక్రమణలకు గురైంది. ఎలువల గుట్టనూ ఆక్రమించారు. కొమరగుంట సర్వేనంబరు 269 తదితర చోట్ల గుట్టను చదును చేశారు.


కొమరగుంట వద్ద కొండను తవ్వేశారిలా..

● గంగాధరనెల్లూరు మండలం కొండేపల్లె సమీపంలోని గుట్టలు కరిగిపోతున్నాయి. పోలినాయుడుపల్లె నుంచి చింతారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో పక్కనున్న గుట్ట కరిగింది. చిత్తూరు-పుత్తూరు ప్రధాన రహదారిలోని పద్మాపురం బస్టాప్ దగ్గర ఆక్రమణలు జరిగాయి.


● కార్వేటినగరం మండలం భువనేశ్వరి గుట్టను చదును చేసి ఆక్రమించుకున్నారు. మొక్కలు నాటేశారు. విజయమాంబాపురం దగ్గర గుట్టను చదును చేస్తున్నారు. ఇలా బహిరంగంగానే కొండలను గుండు కొడుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదు.

టెండర్ ఓటు అంటే ?



ఒక్కోసారి ఓటు వేయడానికి వచ్చేసరికి మీ ఓటు వేసేశారు అని ఎన్నికల సిబ్బంది చెబుతారు. అంటే ఆ ఓటు ఇంకెవరో వేసి వెళ్ళిపోయారన్నమాట. ఇటువంటి సమయంలో ఓటరు తన హక్కును వినియోగించుకోవడానికి తన ఓటు తనే వేస్తానని పట్టుబట్టవచ్చు. ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయచ్చు. వాస్తవంగా ఓటు వేయలేదని నిర్ధారణకు వస్తే ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటుకు వేసేందుకు అవకాశం ఇస్తారు. ఈ ప్రక్రియనే టెండర్డ్ ఓటు అంటారు. ఇందుకోసం ప్రతి పోలింగ్ బూత్‌లో 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఇవి బ్యాలెట్ యూనిట్ పైన అమర్చిన వాటిలాగే ఉంటాయి. ఈ బ్యాలెట్‌ను తీసుకుని ఓటరు కంపార్టుమెంట్‌లోకి వెళ్ళి ఓటు వేసి ఆ పత్రాలు కవర్‌లో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తారు. ఆ బ్యాలెట్ పత్రం వెనుక ఇంక్(సిరా)తో టెండర్డ్ బ్యాలెట్ అని రాస్తారు. దీనిని లెక్కింపులో పరిగణనకు తీసుకుంటారు.

- తిరుపతి కలెక్టరేట్


వి.కోటలో మూతపడిన పాలశీతలీకరణ కేంద్రం

● ఎట్టెట్టా

నేను..గానీ.. ఈల గానీ వేస్తే..



నేను గానీ.. ఈల గానీ వేస్తే.. అని వీధుల్లో గారడీ చేసేవారు అంటూ ఉంటారు. సరిగ్గా జగన్ రెడ్డి పాదయాత్రలోనూ, 2019 ఎన్నికల ప్రచారంలోనూ ఊరూరికీ వెళ్లి ఇట్లాగే మాటలు చెప్పారు. వి.కోటలో మూతబడి, తుప్పుబట్టిన సహకార పాల శీతల కేంద్రాన్ని చూసి కన్నీరు పెట్టి, 'నేను అధికారంలోకి రాగానే తిరిగి తెరిపించి నడిపిస్తా..' అని చెప్పారు. కుర్రాడు కదా.. చెప్పింది చేస్తాడేమో అని జనం కూడా నమ్మారు. ఓట్లు గుద్దారు. అంతే ఆ తర్వాత ఆయన జనం నెత్తిన బాదుడే..బాదుడు కార్యక్రమం అమలు చేశాడు. వి.కోట పాల డెయిరీ కత కలికానికి కూడా రాలేదు. తుప్పుబట్టిన యంత్రాలు.. తుప్పలు మొలిచిన ప్రాంగణం.. ఇదిగో ఇలా ఈసురోమంటూ ఉంది 1980లో ప్రారంభించిన పాలడెయిరీ. - వి.కోట

ఇది.. జగనన్న రోడ్డు

బస్సు దిగుతున్నది చెరువులో అనుకుంటున్నారా.. కాదు కాదు సాక్షాత్తు రోడ్డులోనే. చిత్తూరు-పరదరామి మార్గంలోని ఇరువారం చెక్‌పోస్టు వద్ద రోడ్డుపై చెరువును తలపిస్తున్న గుంత ఉంది. ప్రతిసారీ వర్షం వచ్చినప్పుడల్లా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు గానీ, అధికారులు గానీ తమకు సంబంధం లేదన్నట్లుగా ఉన్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి గుంతలో నీరు చేరింది. దీంతో ఇక్కడ గుంత ఉందన్న విషయం తెలియక చాలా మంది అందులో పడి గాయాలపాలయ్యారు.

- యాదమరి



● ఇదీ సంగతి

జెండా ఎత్తితే రూ.500

పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్దీ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాలను ముమ్మరం చేశారు. తమ గుర్తుకే, తమ పార్టీకే ఓట్లు వేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ.. ప్రచార రథాలతో కలసి ప్రచారాలు సాగిస్తున్నారు. పుంగనూరులో ఇటీవల అన్ని రాజకీయపార్టీల్లోనూ నాయకులు, పార్టీ ముఖ్యకార్యకర్తలు మినహా మిగిలిన వారంతా అద్దెజనమే. ఆయా పార్టీల తరఫున జెండా చేతపట్టుకుని వారి టోపీ ధరించి మెడలో కండువాతో నాయకుల వెంట తిరిగితే ఒక్కొక్కరికి సాయంత్రానికి రూ.500 ఇస్తున్నారు. ఉదయం టిఫన్, మధ్యాహ్నం బిర్యానీ అందిస్తున్నారు. కానీ కొంతమంది అన్ని పార్టీల ప్రచారాల్లోనూ రోజుకో జెండాతో దర్శనమిస్తున్నారు. అన్ని పార్టీలకు వీరి అవసరం ఉండటంతో డిమాండు పెరిగింది.

- పుంగనూరు

ప్రచారానికి అభిమానంతో వచ్చేవాళ్లు

● మా రోజుల్లో...



'అప్పట్లో ఎమ్మెల్యేగా పోటీ చేసే నాయకుడిపై అభిమానం ఉంటే చాలు. ప్రచారంలో అతడి వెంట జనం నడిచి వచ్చేవాళ్లు. అతడి గెలుపునకు కృషి చేసేవాళ్లు. ఇప్పుడు పైసలిస్తేనే ప్రచారానికి వస్తున్నారు' అని పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన టెర్లిన్‌బాషా (87) నాటి రోజులను గుర్తుచేసుకున్నారు. 'నాటితరం ప్రజా ప్రతినిధులు నిరాడంబరమైన జీవితాన్ని గడిపేవారు. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు పంపకాలు ఉండేవి కావు. ఎన్నికల ఖర్చు వేళ్లమీద లెక్క పెట్టేలా ఉండేది. అప్పట్లో ఎంతోమంది ఎమ్మెల్యేలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు. ఇప్పటి ఎమ్మెల్యేలు ఖరీదైన కారుల్లో ప్రయాణం చేస్తున్నారు. మా తరం రాజకీయాతో పోల్చి చూస్తే ఇప్పుడు ఎంతో తేడా కనిపిస్తోంది' అని పేర్కొన్నారు.

- కల్లూరు